నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
బుధవారం | ఫిబ్రవరి 28, 2024 | www.navatelangana.com

ఎస్సై విజయ్‌కుమార్‌ను సన్మానించిన సీపీ అంబర్‌కిషోర్ ఝా





నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో ఈనెల 12వ తేదీ నుండి 16వ తేదీ వరకు నిర్వహించిన 12వ ఆలిండియా పోలీసు డ్యూటీ మీట్‌లో సైంటిఫిక్ ఎయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఫోటోగ్రఫీ విభాగంలో స్వర్ణపతకాన్ని సాధించిన వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన ఎస్సై విజయ్‌కుమార్‌ను వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించారు. మంగళవారం ఈ మేరకు ఎస్సై విజయ్‌కుమార్ పోలీసు కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో పతకాన్ని గెలిచిన విజయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. పోలీసు డ్యూటీ మీట్‌ల ద్వారా పోలీసు అధికారులు విధుల్లో మరింత రాణించేందుకు దోహదపడుతుందన్నారు.

పోలీసు కమిషనర్‌ను కలిసిన ట్రాఫిక్ ఏసీపీ

వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాను నూతనంగా బాధ్యతలు చేపట్టిన ట్రాఫిక్ ఎసిపి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఈ మేరకు పుష్పగుచ్ఛం అందించారు.

నేడు ఇంటర్ పరీక్షలు షురూ..



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటర్‌మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇంటర్‌మీడియట్ పరీక్షలు బుధవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 16వ తేదీన ముగియనున్నాయి. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 77,964 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారు. ఇందుకు జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారుల నేతృత్వంలో అన్నిఏర్పాట్లు చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడమని అధికారులు ప్రకటించారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలోపరీక్షలు నిర్వహించనున్నారు. హన్మకొండ జిల్లాలో 53 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం గమనార్హం. ఫ్లయింగ్,సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

వరంగల్ జిల్లాలో 12,620 మంది విద్యార్థులు ఇంటర్ మీడియట్ పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవ త్సరంలో 6,164 మంది, ఇంటర్ రెండో సంవత్సరంలో 6,456 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిలాలలో 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 9 ప్రభుత్వ కాలేజీలు, 7 ప్రైవేటు కాలేజీలు, 2 మోడల్ కాలేజీలు, 5 ఎయిడెడ్ కాలేజీలు, 3ప్రభుత్వరంగ కాలేజీలున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 5,338 మంది, ఒకేషనల్ 826మంది విద్యార్థులుండగా, ఇంటర్ రెండో సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 5,496 మంది, ఒకేషనల్ విద్యార్థులు 960 మంది వున్నారు. జిల్లాలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఒక జూనియర్ లెక్చరర్, ఒక రెవెన్యూ ఉద్యోగి, ఒకరు పోలీసు ఉద్యోగి వుంటారు. జిల్లాలో 2 కస్టోడియన్ బృందాలున్నాయి. ఒకటి నర్సంపేటలో, మరొకటి మట్టెవాడ కేంద్రంగా పనిచేస్తాయి.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు

హన్మకొండ జిల్లాలో 38 వేల 837 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్నారు. జిల్లాలో 7 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 6 ప్రభుత్వ రంగ జూనియర్ కాలేజీలు, 40 ప్రైవేటు జూనియర్ కాలేజీలున్నాయి. జిల్లాలో 53 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 53 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరంలో 19 వేల 528 మంది విద్యార్థుల్లో జనరల్ 18 వేల 552 మంది, ఒకేషనల్ 976 మంది విద్యార్థులున్నారు. ఇంటర్ రెండో సంవత్సరంలో 19 వేల 309 మంది విద్యార్థులు

- అన్ని ఏర్పాట్లు పూర్తి ...నిమిషం ఆలస్యమైనా ప్రవేశం లేదు..
- మహబూబాబాద్ డిఐఇఓ ఎస్.సత్యనారాయణ



కాగా ఇందులో జనరల్ 18 వేల 361 మంది, ఒకేషనల్ 948 మంది విద్యార్థులున్నారు. 53మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 54 మంది డిపార్ట్ మెంటల్ అధికారులు, 40 మంది అడిషనల్ ఛీఫ్ సూపరిం టెండెంట్లు, 10 మంది కస్టోడియన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 2, సిట్టింగ్ స్క్వాడ్‌బృందాలు 4 వున్నాయి. 975 మంది ఇన్విజిలేటర్లు ఇంటర్ పరీక్షలకు నియమించారు.

మహబూబాబాద్‌లో 9,469 మంది విద్యార్థులు

మహబూబాబాద్ జిల్లాలో 9,469 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,560 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇందులో జనరల్ 3,329 మంది విద్యార్థులు, ఒకేషనల్ 1,231 మంది విద్యార్థులున్నారు. ఇంటర్ రెండో సంవత్సరానికి సంబంధించి 4,909 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో జనరల్ 3,685 మంది, ఒకేషనల్ 1,224 మంది విద్యార్థులున్నారు. 19 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 5గురు అడిషనల్ ఛీఫ్ సూపరింటెండెంట్లు, 19 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 3గ్గురు కస్టోడియన్లు, 2 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 1ఫ్లయింగ్‌స్క్వాడ్, 172 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 250 మంది సిబ్బందిని ఇంటర్ పరీక్షలలో విధులు నిర్వహించనున్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం : ఎస్. సత్యనారాయణ, డీఐఈవో మహబూబాబాద్

ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాలకు అనుమతించం. ఎలక్ట్రిక్ పరికరాలను అనుమతించేది లేదు. స్మార్ట్ ఫోన్‌లను సైతం అనుమతించం. హాల్ టికెట్, పెన్, పెన్సిల్, రబ్బర్, ఎగ్జా మ్ప్యాడ్, మ్యాథమెటిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తాం. పరీక్షలతో విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడి నుండి బయటపడడానికి 14416 టోల్ ఫ్రీనెంబర్‌ను సంప్రదించాలి.

ములుగులో 3,973 మంది విద్యార్థులు

ములుగు జిల్లాలో ఇంటర్ పరీక్షల నిమిత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం 1,717మంది విద్యార్థులు, ఇంటర్ రెండో సంవత్సరం 1,969 మంది విద్యార్థులు మొత్తం 3,973 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ 1,717మంది, ఒకేషనల్ 287 మంది విద్యార్థులుండగా, ఇంటర్ రెండోసంవత్సరంలో జనరల్ విద్యార్థులు 1,696 మంది, ఒకేషనల్ 273 మంది విద్యార్థులున్నారు.

భూపాలపల్లిలో 3,925 మంది విద్యార్థులు

భూపాలపల్లి జిల్లాలో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరాలకు సంబంధించి మొత్తం 3,925 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరంలో 2,161 మంది విద్యార్థులు, ఇంటర్ రెండో సంవత్సరంలో 1,764 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

జనగామ జిల్లాలో 9,140 మంది విద్యార్థులు

జనగామ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించడానికి 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక ఫ్లయింగ్‌స్క్వాడ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించా రు. జిల్లాలో 9,140 మంది విద్యార్థులు పరీక్షలు రాయను న్నా రు. ఇంటర్‌మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 3, 166 మంది, ఒకేషనల్ 1,197మంది, ఇంటర్ రెండో సంవ త్సరంలో జనరల్ విద్యార్థులు 3,578 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,198మంది పరీక్షలు రాయనున్నారు.

రుణం కల్పించేలా కృషి చేయాలి : కలెక్టర్

నవతెలంగాణ-వరంగల్

ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకానికి అర్హత కలిగినవారికి రుణం కల్పించేలా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికా రులతో పీఎం విశ్వకర్మ యోజన పథకం జిల్లా మానిటరింగ్ కమిటీ మొదటిసమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అధ్యక్షతన జరిగింది. స్వీకరించిన దరకాస్తులను క్షేత్రస్థాయిలో పారద ర్శకంగా పరిశీలించి అర్హులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి విశ్వ కర్మ యోజన పథకానికి నైపుణ్య ధ్రువీకరణ తర్వాత 5-7 రోజులపాటు ప్రాథమిక శిక్షణ ఉంటుందని, అదేవిధంగా 15రోజులపాటు అధునాతన శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ తర్వాత రూ.15 వేల విలువైన పనిముట్లను ప్రోత్సాహకంగా అందిస్తారని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారా మొదటి విడతగా లక్ష రూపాయలు, రెండో విడతగా రూ.2 లక్షల రుణం అందించబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహమూర్తి, జెడ్పి సీఈఓ రాంరెడ్డి, డిఆర్‌డిఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసా యశాఖ అధికారి ఉషాదయాల్, జిల్లా వెనుకబడిన అభివద్ధి సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, సివిల్ సప్లై లావణ్య, డిపిఓ కల్పన, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారికి కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఎస్సై సస్పెన్షన్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

హన్మకొండ జిల్లా ఆత్మకూరు ఎస్సై జి.ప్రసాద్‌ను వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సస్పెండ్ చేశారు. అగ్రంపాడు సమక్క, సారలమ్మ జాతరకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు కొందరు జై తెలంగాణ నినాదాలు చేసినందుకు పోలీసులు తప్పుడు కేసులు బనాయించి ఆత్మకూరు, దామెర మండలాల నుండి బిఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని విచక్షణ రహితంగా థర్డ్‌డిగ్రీ ఉపయోగించి చితకబాది అక్రమ కేసులు బనాయించిన పోలీసు అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, వరంగల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు అరూరి రమేష్ డిమాండ్ చేసిన విషయం విధితమే. వీరంతా పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను కలిసి జరిగిన దాడిపై ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపి న్యాయం చేస్తానని పోలీసు కమిషనర్ హామినిచ్చారు. ఈ మేరకు ఎస్సై ప్రసాద్‌ను సస్పెండ్ చేశారు.

రవిచంద్రలో ఘనంగా స్వయం పరిపాలన

నవతెలంగాణ-సంగెం

మండల కేంద్రంలోని రవి చంద్ర కాన్సెప్ట్ పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టస్మా జిల్లా చీఫ్ అడ్వైజర్ కాసం చంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ క్రాంతి కుమార్ హాజరై మాట్లాడుతూ పిల్లలు ఉపాధ్యాయులుగా మంచి ప్రతిభను ప్రదర్శించారన్నారు. పదో తరగతి విద్యార్థులు ఆర్జేడిగా ఎస్.సాంసంగ్, డీఈఓ ఎస్ సిరి, డిప్యూటి డీఈఓ జై.చరణ్, ఎంఈఓ టీ నికిత, ప్రి న్సిపాల్ పి.రిషిత, వైస్ ప్రిన్సిపాల్ బి.రుచిత తదితరులు బోధనతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, రవీందర్, రాజు, సంగీత, సంధ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్టకు ముహూర్తం ఖరారు

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర సురమాంబ సమిత, ఎల్లమ్మ, మైసమ్మ విగ్రహ ప్రతిష్టకు సుముహూర్తాన్ని మంగళవారం పర్వతగిరి కంఠమహేశ్వరస్వామి ఆలయంలో ఖరారు చేసినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 15న మాలాధారణ, పటంకథ. 16న రెండవ కథ, 17న సురమాంబ కథ, 18న గ్రామదేవతల తోరణాలు, 19న దేవతల ఊరేగింపు, 20న హోమం, 21న విగ్రహ ప్రతిష్టాపన, 22న బోనాలు, 23న బలిదానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు తీగల వీరస్వామి గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు రంగు జనార్ధన్, పుల్లూరు సారయ్య, రంగుకుమార్,రంగు కుమారస్వామి, దోనికని దయాకర్, చీకటి యాకయ్య, ముంజ శ్రావణ్, జనగం శ్రీనివాస్, పంజల మహేష్, బత్తిని రాజు, పెద్దరాజు, సరకొల్లు, దొనికేని కొమురయ్య, రాజు, మహేష్, రాజేష్, కక్కర్ల ఐలయ్య పాల్గొన్నారు.

గురుకులాల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-నర్సంపేట

సాంఘీక సంక్షేమ గురుకులాకు పెండింగ్ మెస్ బిల్లులు చెల్లించాలని ఏబీవీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నరేష్ మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ గురుకులాలు, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, సీవోఈ గురుకులాలకు ఆరు నెలలుగా మెస్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులకు నైణ్యమైన భోజనం అందడం లేదన్నారు. విద్యార్థులు వార్షిక పరీక్షలు రాస్తున్న తరణంలో సరైన భోజనం లేకపోవడం వల్ల అర్ధాకలితో అలమటించాల్సిన దుస్థితి ఎదురైతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి విద్యార్థుల భవిష్యత్‌కు తోడ్పాడాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు.

నేటి విజయ సంకల్పయాత్రను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నర్సంపేట

ఈ నెల 28న నేడు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కంభంపాటి ప్రతాప్ కోరారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రతాప్ మాట్లాడుతూ యాత్రను మంగళవారి పేట నుంచి ప్రారంభం కానున్న యాత్రకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జనాన్ని కదిలించాలని కోరారు. ఈ సమావేశంలో మల్యాల వినయ్ కుమార్, బాల్నే జగన్, కౌన్సిలర్‌లు శీలం రాంబాబు, జుర్రు రాజు, మినుముల రాజు, కవిత, కొంపెల్లి రాజు, శివరాం, రవీందర్, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-సంగెం



రోటరీ క్లబ్ వరంగల్ సౌజన్యంతో మొండ్రాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, స్టేషనరీ దాదాపు 25 వేలు వెచ్చించి వితరణ కార్యక్రమం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మామిడాల రమేష్‌బాబు, బి.ఆనందరావు,ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనంతుల కుమారస్వామి ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ, ఉపాధ్యాయ బృందం సుజాత, కమరున్నిసా, మాజీ సర్పంచ్ లు మెరుగు మల్లేశం, గూడ కుమారస్వామి,కక్కెర్ల వీరస్వామి, వేల్పుల కుమారస్వామి, పెండ్లి రమేష్, పరికిమోహన్, పరికి మహేందర్, యాకయ్య, దయాకర్ పరికిరాజు, లక్క రాజు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాప్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

నర్సంపేట : మెడికల్ షాప్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని డ్రగ్ ఇన్స్పెక్టర్ అరవింద్‌రెడ్డి అన్నారు.మంగళ వారం పట్టణంలోని పలు మెడికల్ షాప్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా నిబంధనలు పాటించని మెడికల్‌షాప్‌లను షోకాజ్ నోటీసులు జారీచేశారు. లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో ఉన్న ఆరోగ్యానికి హానికరమైన మందులను విక్రయించొద్దని అన్నారు. మెడికల్ షాప్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, మందులను కావలసిన ఉష్ణోగ్రతలో ఉంచాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం జిల్లా డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో జిల్లారోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్క రూ వైకల్యంబారిన పడకుండా, ప్రాణాలు కోల్పో కుండా ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. రోడ్డు సక్రమంగా లేకపోవడం, సైనేజ్బో ర్డు లు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్ లు లేకపోవడం వల్ల అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ శాఖలు అలాంటి ప్రదేశాలను గుర్తించి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్,రవాణా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పట్టణాలలో సరయిన పార్కింగ్ స్థలాలు లేక రోడ్లపైనే పార్కింగ్ చేసే చేస్తున్నారని, మున్సిపల్ అధికారులు పా స్థలాల ను గుర్తించాలన్నారు. గతంలో సమావేశంలో గుర్తించిన 19బ్లాక్ స్పార్ట్స్ పై తీసుకొన్న చర్యలపై సమీక్షించారు. గతంలో బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించిన 19 పనుల్లో 11 పనులు నేషనల్ హైవే అథారిటీ వారు పూర్తి చేశారని మిగతా పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హైవేరోడ్లపైన స్పీడ్ బ్రే కర్స్ అలాగే, మూల మలుపుల వద్ద కాషన్ బోర్డ్స్ ఏర్పాటు చేయించాలన్నారు. టూ వీల్లర్‌పై వెళ్ళుటకు రోడ్లకు ఇరువైపులా మార్క్స్‌ను తరచూ పర్యవే క్షిం చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఫోర్‌లైన్స్‌రోడ్స్ ఉన్నచోట్ల ప్రజలకు ఇబ్బంది కలుగకుం డా క్యాష్ బెరియర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే రద్దీఎక్కువగా ఉన్న ప్రాంతాలలో వాహనాల వేగాన్ని నియంత్రించుటకు డబుల్స్ స్టిక్స్ ను ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. డీసీపీ రవీందర్ మాట్లాడుతూ హైవేల్లో ప్రమాదాలు జరిగినప్పుడు హైవేల్లో ఉండే దాబాలపై, గ్రామాలకు దగ్గర్లో ఉన్న ఆసుప త్రుల వివరాలు తెలిపే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయా లని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి అధికారి జితేందర్‌రెడ్డి, ఆర్టీవో లక్ష్మి, పీఆర్ ఇంజనీరింగ్ అధికారి ఇజ్జగిరి, టీఎస్ ఆర్టీసీ డీఆర్ఎం భానుకిరణ్, జిల్లా కమర్షియల్ టాక్స్ అధికారి వెంకటేశ్వర్లు, ఏసీపీలు కిరణ్ కుమార్, సతీష్ బాబు, నరసయ్య సత్యనారాయణ, ఎన్‌హెచ్ఏఐ అధికారి నమకం, జీడబ్ల్యుఎంసీ ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, వర్ధన్నపేట ఎంసీ జోనా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

నవతెలంగాణ-నెక్కొండ



రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు అవలం భిస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విరమించుకోవాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, సీపీఐ మండల కార్యదర్శి కందిక చె న్నకేశవులు అన్నారు. మండల కేంద్రంలో రైతు కా ర్మిక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అండర్ బ్రిడ్జి నుండి అంబే ద్కర్ సెంటర్ వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ రైతులపట్ల నిరంకుశంగా వ్యవహరి స్తున్న నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రైతులకు వ్యతిరేకంగా నూతనంగా తీసుకువచ్చిన మూడునల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతులు పండిస్తున్న పంటకు మద్దతు ధర ప్రకటించే వరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నా రు. ముక్కోటిదేవతలకు నైవేద్యం కూడా రైతులు పండించిన పంట ద్వారానే వస్తుందని అలాంటి దేవుళ్ళకు నైవేద్యంపెట్టిన రైతులను దేశ రాజధాని ఢిల్లీ సరి హద్దుల్లో కాల్చి చంపడం హేయమైన చర్య అని, కాల్పుల్లో చనిపోయిన యువ రైతుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యతవహించి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, లేనిపక్షంలో రైతులు కార్మికులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాస్తారోకో అనం తరం నెక్కొండ తాసిల్దార్ రాజ్ కుమార్ రైతు కార్మిక వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలని పలు డి మాండ్లతో కూడిన వినతిపత్రమిచ్చారు.

ఈ కార్యక్రమంలోనాయకులు కనుకుల దేవపాల, మైదం యాదయ్య, సింగం వెంకటలక్ష్మి, ఎండి ఫయాజ్ దబ్బేట వీరయ్య, సాధబోయిన వీరస్వామి, నిమ్మ లచ్చమ్మ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన మెస్‌చార్జీలను అమలు చేయాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

టీజీపీఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ బిక్షపతి డిమాండ్ చేశారు. హన్మకొండ హంటర్ రోడ్డు ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం టీజీపీఏ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ తనుగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిక్షపతి మాట్లాడుతూ గురుకుల సంక్షేమానికి నూతన ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై హర్షం వ్యక్తం చేశారు. గురుకుల విద్యగుణాత్మకతను పెంపొందించే దిశగా కృషిచేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా టీజీపీఏ డైరీ , క్యాలెండర్ 2024 ను ఆవిష్కరించారు. మ. ఈ కార్యక్రమంలో విమెన్ సెక్రెటరీటీ నీలిమ దేవి, కృష్ణకుమారి, శ్రీలత, మాదవీలత, వనజ,రాజు,శ్రీ నివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నీటిఎద్దటి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-ఖానాపురం

వేసవికాలం సమీపించడంతో రానున్న ఐదు నెలలు పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి గ్రామాలలో ప్రజలకు నీటి ఎద్దటి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని మండల మంచినీటి సరఫరా ఇంజనీరింగ్ శాఖ అధికారి మౌనిక అన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడకుండా తాగునీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. రానున్న వేసవిలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీల కారణంగా సకాలంలో నీరు అందకపోతే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయంగా గ్రామపంచాయతీ బావులు, బోరింగ్ లు ద్వారా గ్రామాల ప్రజలకు నీటి సరఫరా అందించాలని సూచించారు.



రానున్న వేసవి కాలానికి తగ్గట్టుగా పంచాయతీ కార్యదర్శు లు పక్క ప్రణాళికలు తయారు చేసుకుని వాటిని అనుసరించి ప్రజలకు నీటి ఎద్దటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో భారతి, మండల పంచాయతీ అధికారి పసరగొండ రవి, పంచాయతీ కార్యదర్శులు సట్ల సుప్రజ, అనిత, దోమల రజిత, షేక్ అబేదాబేగం, హైమ, ఉష, స్రవంతి, వరుణ్, శ్యామల, సుధాకర్, బాలు, యుగేందర్, జనార్ధన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి సీసీఎఫ్‌గా డాక్టర్ బి.ప్రభాకర్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భూపాలపల్లి కేంద్రంగా వున్న కాళేశ్వరం సర్కిల్ అటవీ సంరక్షణాధికారి (సిసిఎఫ్)గా డాక్టర్ బి. ప్రభాకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు జిల్లా అటవీ శాఖాధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మహబూబాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి టి. రవికిరణ్‌ను మీసేవ కమిషనర్‌గా బదిలీచేసింది. వరంగల్ జిల్లా అటవీ శాఖాధికారి అపర్ణను డిప్యూటీ సిసిఎఫ్‌గా హైద్రాబాద్ హెడ్ క్వార్టర్‌కు బదిలీచేసింది. ఏటూర్‌నాగారం డిఎఫ్ఓ అనుజ్ అగర్వాల్‌ను వరంగల్ జిల్లా అటవీ శాఖాధికారిగా, ఆమ్రాబాద్ అటవీ డివిజనల్ అధికారి విశాల్‌బత్తులను మహబూబాబాద్ అటవీ శాఖాధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ఛీఫ్ సెక్రటరీ శాంతికుమార్ ఉత్తర్వులు జారీ చేసింది.

మాది చేతల ప్రభుత్వం : కాంగ్రెస్

నవతెలంగాణ-పర్వతగిరి

ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు లో బాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని, మాది చేతల ప్రభుత్వం అని,కోతల ప్రభుత్వం కాదు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు నేడు అమలవుతున్న సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రావు, సొసైటీ డైరెక్టర్ గంగాధర్ రావు, నాయకులు రాఘవులు, నరుకుడు రవీందర్, దారం పూర్ణ చందర్, మాధవరావు, బోట్ల వీర స్వామి, జంగా సాంబయ్య, మాల కొండయ్య, సతీష్ రావు, చింతకుం ట్ల మల్లికార్జున్, భాస్కర్ నాయక్, బోట్ల వెంకటేశ్వర్లు, కనకరాజు, సాయికృష్ణ , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-గీసుగొండ

విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని పొంది పోటి ప్రపంచానికి ధీటుగా సమాధానం ఇవ్వాలని అల్లం బాల కిషోర్ రెడ్డి అన్నారు. మండలంలోని మనుగొండలో బాల కిషోర్ రెడ్డిని ఆయన నివాసంలో వాగ్దేవి కళాశాల విద్యార్థులు కలిసి వారి కాలేజీలో పినాకిల్ 2024 ఈవెంట్ గురించి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈవెంట్ ఏర్పాటుకు రూ.1.50 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. ఈవెంట్ ఏర్పాటుకు విరాళాన్ని ప్రకటించినందుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.


పర్వతగిరి ఎస్సైగా వెంకన్న

నవతెలంగాణ-పర్వతగిరి

పర్వతగిరి ఎస్సైగా గుగులోత్ వెంకన్న మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం వరంగల్ లోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నుండి ఇక్కడికి బదిలీ పై వచ్చారు. సందర్భంగా ఆయనకు స్థానిక పోలీస్ సిబ్బంది ఆయన కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం వర్సెస్ ఎంపీ బండి

- పోటాపోటీగా ఫ్లెక్సీల చింపివేత
- ఇరువర్గాల కార్యకర్తలు ఒకరిపై మరొకరి దాడి



నవతెలంగాణ-భీమదేవరపల్లి

హుస్నాబాద్ నియోజకవర్గంలో గత మూడు రోజులుగా కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య పోటాపోటీగా ఒకరిపై ఒకరు ప్రత్యక్ష దాడులు, మాటల తూటాలు పరిధి దాటుతున్నాయి. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చిగురుమామిడి మండలంలో యాత్ర చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. మంగళవారం ఉదయం హుస్నాబాద్ మండలం రాములపల్లెలో బండి సంజయ్ యాత్ర చేపడుతుండగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు ఎదురు దాడి చేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులకు గాయాలయ్యాయి. ఆగ్రహించిన కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ ఫ్లెక్సీలను కొన్నిచోట్ల చింపి వేస్తూ అసభ్య పదజాలంతో పెన్నులతో రాశారు. మంగళవారం హుస్నాబాద్ భీమదేవరపల్లి మండలాల్లో బండి సంజయ్ యాత్ర ఉండగా పోలీసులు అల్లర్లు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సకాలంలో రైతులు రుణాలు రెన్యువల్ చేసుకోవాలి



నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు డీసీసీ బ్యాంకులో, బ్యాంకు పరిధిలోని సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆత్మకూర్ పిఎసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు రుణాలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో భాగంగా 2 లక్షల పైగా ఉన్న రైతులు వడ్డీలు చెల్లించి రుణమాఫీకి అర్హులు అయ్యే అవకాశం ఉందని కావున రైతులు సత్వరమే చెల్లించి తమ రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. కావున అధ్యక్షులు, కార్యదర్శులు రైతుల వద్ద నుండి వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ హరిత, బ్యాంక్ మేనేజర్ శ్వేత, సూపర్ వైజర్ రాజేష్, శాయంపేట చైర్మన్ కే శరత్ బాబు, సంఘం కార్యదర్శులు ఓం ప్రకాష్, రాజమోహన్, లక్ష్మయ్య, శ్రీనివాస్, సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

భారతరత్న పీవీకి వంగరలో ఘన నివాళి



నవతెలంగాణ-భీమదేవరపల్లి

మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వడం పట్ల తెలంగాణ కరణం నియోగి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పీవీ స్వగ్రామం వంగరలో పివికి మంగళవారం ఘన నివాళులర్పించారు. పీవీ కుటుంబ సభ్యులైన సోదరుడు మనోహర్ రావు, కుమారుడు ప్రభాకర్‌రావు, కుమార్తె ఎమ్మెల్సీ వాణిదేవి, కుటుంబ సభ్యులు పివి కశ్యప్, పీవీ సీతారామారావు, నచ్చరాజు సుభాష్, సుధా, కిరణ్, పీవీ శరత్, ఇందిరా దేవి, శారదా దేవి, సంతోష్ రావు, పీవీ మదనమోహన్ లను ఘనంగా సన్మానించారు. పీవీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని 33 జిల్లాల పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన ఎంపీటీసీలు

నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట ఎంపీడీవో గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఫణీచంద్రను మంగళవారం ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలిసి చేనేత వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలుబాసాని చంద్రప్రకాష్, మేకల శ్రీనివాస్, అజ్మీర ఉమారఘుసింగ్, ఎంపీఓ రంజిత్ కుమార్ పాల్గొన్నారు. శాయంపేట సర్కిల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన పి. రంజిత్ రావును శాయంపేట ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

29న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

నవతెలంగాణ-సుబేదారి

ఉమ్మడి వరంగల్, హనుమకొండ జిల్లా నిరుద్యోగ యువతి, యువకులకు ఈ నెల29న వరంగల్ ములుగు రోడ్‌లోని ప్రభుత్వ ఐటిఐ క్యాంపస్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నటు జిల్లా ఉపాధి కల్పన అధికారి యం.మల్లయ్య తెలిపారు. జెఎస్‌ఆర్ సన్ సిటీ కంపనీలో 50 మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాల ఎంపికకు జాబ్ మేళా నిర్వహించబడుతుందని, 18 నుండి 50ఏళ్ల వయసుగల నిరుద్యోగ యువతీ యువకులు ఉమ్మడి వరంగల్‌లోపని చేయుటకు ఎస్‌ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ కలిగి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి గల వారు విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ములుగు రోడ్‌లోని జిల్లా ఉపాధి కార్యాల యంలో 29న ఉదయం 11 గంటలకు జరిగే జాబ్ మేళాకు హాజరు కావల సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు 9848895937లో సంప్రదించాలన్నారు.

సంకల్ప యాత్రను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-పరకాల

ఈ నెల 29న పరకాలలో జరిగే విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ కాళీ ప్రసాద్ పిలుపునిచ్చారు .మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ 29న సాయంత్రం పరకాలకు చేరుకొని స్థానిక అమరధామకు వెళ్లి అమరులకు నివాళులర్పించిన అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగునని అందుకు సంకల్ప విజయ యాత్రను విజయవంతం చేయుటకు ప్రతి ఒక్కరు కషిచేసి బిజెపి గెలుపుకు నాంది కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయచందర్‌రెడ్డి, డాక్టర్ సంతోష్ కుమార్, మంద ఐలయ్య, ఎర్రం రామన్న, రాజభద్రయ్య, కౌన్సిలర్లు ఆర్పి జయంతిలాల్, భద్రయ్య, పూర్ణాచారి, మార్త బిక్షపతి, మేఘనాథ్, రంజిత్, విజయ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై సస్పెండ్ చేయడం సరికాదు

నవతెలంగాణ-ఆత్మకూరు

విధి నిర్వహణలో తనపని తాను చేసుకుంటూ ముందుకు వెళ్తున్న ఎస్సైని బీఆర్‌ఎస్ నేతలు రాద్ధాంతం చేసి సస్పెన్షన్ చేయించడం సరికాదని కాంగ్రెస్‌మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్న ఎస్ఐ ప్రసాద్‌ని కుట్రపూరితంగా నిందమోపి ఆయన సస్పెన్షన్ కి కారణమయ్యారని ఆరోపించారు. ఎస్ఐ సస్పెన్షన్ రద్దు వెంటనే చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పక్షాన ఆయనకు మద్దతుగా నిలిచి న్యాయం జరిగేలా ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ నాగేల్లి సామెల్, రేవూరి జయపాల్ రెడ్డి తనుగుల సందీప్, అల్వాల రవి, పెరుమాండ్ల భాస్కర్‌లు పాల్గొన్నారు.

అంతిమంగా వాస్తవానిదే విజయం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

తప్పుడు ఆరోపణలు ఎక్కువ రోజులు మనుగడలో ఉండవు అని ధర్మసాగర్ మండలం మలకపల్లి గ్రామవాసి నరిశెట్టి పున్నం చందర్ అన్నారు. మంగళవారం హన్మకొండలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పున్నం చందర్ మాట్లాడుతూ గతంలో తన పైన కొందరు వ్యక్తులు కావాలని మోసపూరిత ఆరోపణలుచేసి కేసులు పెట్టారు. ఫేక్ సర్టిఫికెట్స్ పేరుతో నా మీద నిందలు వేసి ఇబ్బందులు పెట్టినా అవన్నీ అబద్ధమని తెలంగాణ హైకోర్టు ఈనెల 26న కేసులను కొట్టేసిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తప్పుడు ఆరోపణలు ఎక్కువ రోజులు ఉండవని న్యాయస్థానంపై పూర్తి నమ్మకం ఉందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు హర్షణీయం

నవతెలంగాణ-సుబేదారి

జీవో 317 ద్వారా అమలుతో జరిగిన ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫారసు చేయడం కోసం ప్రభుత్వం జీవో 292 ద్వారా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని హనుమకొండ జిల్లా స్వాగతిస్తుందని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ అన్నారు. జిల్లా టీఎన్‌జీఓస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు

ఆర్థిక మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



నవతెలంగాణ-సుబేదారి

ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హనుమ కొండ జిల్లాకలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత- అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆన్లైన్ లావాదేవీల పైన తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు పొదుపును అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత అంశంపై మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై మాటాడుతూ ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత- అవగాహన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ముందుగా పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

అనంతరం పాఠశాల నుంచి అదాలత్ కూడలి నుండి హంటర్ రోడ్డు మీదుగా పాఠశాల వరకూ విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ ర్యాలీగా సాగారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎస్బిఐ రీజినల్ మేనేజర్ రఘునాథ్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం.హరి ప్రసాద్, బీసీ వెల్ఫేర్ డిడి రామ్ రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డి, హెచ్‌ఎం నెహ్రూ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో నామినేషన్లు వేస్తాం

- రాష్ట్ర దళితబంధు సాధన ఐక్య పోరాట సమితి



నవతెలంగాణ-హనుమకొండ

రాబోయే పార్లమెంటు ఎన్నికల కోడ్‌లోపు ప్రభుత్వం స్పందించి దళిత బంధు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయకుంటే పార్లమెంటు ఎన్నికల్లో నామినేషన్లు వేస్తామని రాష్ట్ర దళిత బంధు సాధన ఐక్య పోరాట సమితి అధ్యక్షులు కోగిల మహేష్, రాష్ట్ర కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్యలు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షులు కోకిల మహేష్ రాష్ట్ర కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్య గారి ఆధ్వర్యంలో వివిధ జిల్లాలకు చెందిన దళిత బంధు లబ్ధిదారులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గౌరవ జిల్లా కలెక్టర్ ల ద్వారా పారదర్శకంగా ఎంపిక చేసి గ్రౌండింగ్ చేసినటువంటి రెండో విడత దళిత బంధు లబ్ధిదారుల ఖాతాల్లో జిల్లా కలెక్టర్ ల అకౌంట్లో ఉన్నటువంటి డబ్బులను రిలీజ్ చేసి వారి ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని లేని పక్షంలో రాబోయే పార్లమెంటు ఎలక్షన్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత బంధు లబ్ధిదారులందరం పార్లమెంటు ఎలక్షన్లలో నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు. గత రెండు నెలలుగా శాంతియుత మార్గాల ద్వారా నిరసన కార్యక్రమాలు, దీక్షలు చేపట్టామని ప్రభుత్వం ఇకపై కూడా స్పందించకుంటే భవిష్యత్తులో ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా దళితుల ఆకాంక్ష తెలిసే విధంగా దళితుల ఆకలి తెలిసే విధంగా కార్యాచరణ రూపొందించుకుంటామని దయచేసి ప్రభుత్వం దళితులను ఏదో ఒక రాజకీయ పార్టీకి ఆపాదించకుండా దళిత బిడ్డలంటే అనాధికాలనుండి వెనకబాటుకు గురైన జాతీయ అని గుర్తించి వారికి డబ్బులను మంజూరు చేసి వారి జీవితాలను బాగు చేయాలని కోరారు. అలాగే రెండో విడత దళితబంధు ద్వారా ఎంపికై గ్రౌండింగ్ అయిన లబ్ధిదారులను మార్పులు చేర్పులతో చేయాలని చూడద్దని వారందరూ దళిత బిడ్డలేనని గుర్తించాలని గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క లకు అలాగే రాష్ట్ర మంత్రి మండలికి పలుమార్లు విజ్ఞప్తి చేశామని మా విజ్ఞప్తిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తామని అలాగే దానికోసం బడ్జెట్లో 1000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని ప్రకటనను స్వాగతించామని ప్రభుత్వానికి గుర్తు చేశారు .ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని అలా చేసినట్లయితే ప్రభుత్వానికి కూడా పూర్తిగా మద్దతుగా దళిత సమాజం ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత బంధు సాధన సమితి నాయకులు కావేరి చిన్ని కృష్ణ, మడికొండ రమేష్, బోనగిరి శ్రీనివాస్ దర్శనాల సంజీవ దుర్గం రాజేష్, ఏకు కార్తీక్, ఐత ప్రశాంత్, కనకం విశ్వనాథ్, అచ్చుకట్ల రమేష్, భూపెల్లి రాజు, గోల్కొండ బుచ్చన్న, మాదరి రాంబాబు రామకష్ణ,రమేష్ గాజర్ల వెంకన్న, ఎడ్ల కిరణ్ బీసా సాంబయ్య మరియు వివిధ జిల్లాల నియోజకవర్గాలకు చెందిన దళిత బంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు రూ.6వేల పెన్షన్ చెల్లించాలి

- ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు రాజుగౌడ్

నవతెలంగాణ-కమలాపూర్

కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు 6 వేల పెన్షన్ ఇవ్వాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు జక్కు రాజు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు 6 వేల పెన్షన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, కార్మిక చట్టాలను, పరిశ్రమల పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి కార్మికుల హక్కులను రాస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం భవన నిర్మాణంలో, కేంద్ర ప్రభుత్వం ఒక్క శాతంగా ఉన్న శిస్తును రెండు శాతంగా పెంచాలని, 60 సంవత్సరాలు వయసు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు 6 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, సలహా బోర్డు కార్మిక గుర్తింపు పొందిన నాయకులను సభ్యులుగా తీసుకోవాలని కోరారు. గతంలో పెండింగ్లో ఉన్నపంచన బెనిఫిట్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పాండిచ్చేరి ప్రభుత్వం ఇస్తున్న తరహాలో తెలంగాణ ప్రభుత్వం దసరా కానుకగా భవన నిర్మాణ కార్మికులకు 3వేల రూపాయల చొప్పున గుర్తింపు కార్డు ఉన్న కార్మికులకు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల పనిచేస్తున్న కార్మికులందరికీ అడ్డాలపై షెడ్యూలు నిర్మాణం చేసి మంచి నీటి సౌకర్యం కల్పించాలి. ప్రతి గుర్తింపు పొందిన కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. మరణించిన కార్మికులకు 10 లక్షల రూపాయలు ఇవ్వాలి. అలాగే సాధారణ మరణం చెందిన వారికి ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెళ్లి కానుక ఒక లక్ష వరకు పెంచాలి. కొత్త వారికి ఇవ్వాలి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను భవన నిర్మాణ కార్మికులకు అర్హులైన కార్మికులకు వర్తింపజేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కార్మికులు శ్రమకు నమ్ముకుని నిరంతరం ఆకాశాన్ని అంటే భవనాలు నిర్మిస్తున్నప్పటికీ నిర్మాణ కార్మికులకు బ్రతుకుల్లో మాత్రం మార్పు లేదన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనైనా భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ ద్వారా ప్రతి గుర్తింపు కార్డు ఉన్న కార్మికులకు ఈ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలి. 29న, జరిగే జిల్లా కార్మిక శాఖ డిసిఎల్ కి, కార్మికుల పట్ల మెమోరాండం ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

భవన నిర్మాణ కార్మికులు ప్రతి మండలం నుంచి తమ యొక్క హక్కుల సాధనకై హనుమకొండ కలెక్టరేట్ కార్మిక శాఖకు ఉదయం10 గంటలకు ప్రతి భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనుల నివేదికను సమర్పించాలి

- నగర మేయర్ గుండు సుధారాణి



నవతెలంగాణ-వరంగల్

సాధారణ నిధులు, ఎస్సీ సబ్‌ప్లాన్, పట్టణ ప్రగతి, ముఖ్య మంత్రి హామీ,15వ ఫైనాన్స్ నిధుల క్రింద 2020-21 సం వత్సరం మే నుండి ఇప్పటి వరకు పూర్తిచేసిన, కొనసాగుతున్న అభివృద్ధి పనుల డివిజన్లవారిగా నివేదికలను సమ ర్పించండి అని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ వేసవిలో నీటిఎద్దడి నివారణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రధాన నాలాలైన భద్రకాళి, వడ్డేపల్లి నా ళాలు, రాంనగర్, గుండ్ల సింగారం దర్గా, భట్టుపల్లి ప్రాంతాల్లో అంతర్గత మురుగునీటి కాలువల టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి పనులను చేపట్టి వర్షాకాలం ప్రారంభం లోగా పూర్తి చేయాలని అన్నారు. సమ్మర్ యాక్షన్ లో ప్లాన్‌లో భాగంగా బల్దియావ్యాప్తంగా ఉన్న అన్నిఆవాసాలకు నీటిని అందించే లా చర్యలు చేపట్టి లీకేజీలు, మరమ్మత్తు పనులకు వార్షికనిర్వహణను మార్చినుండి చేపట్టాలన్నారు. బల్దియా ఇంజనీరింగ్ అధికారులు సమన్వయం తో క్షేత్రస్థాయిలో పర్యటించి 2023లో 2217 లీకేజీలను గుర్తించి 1649 లీకేజీల అరికట్టడం జరిగిందని, నూతనం గా ఉత్పన్నమైన లీకేజీ లను అరికట్టాల్సి ఉందని మేయర్ తెలిపారు. ఈ స మావేశంలో ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

పసిడి పతక విజేతకు అభినందనలు



నవతెలంగాణ-కాజీపేట

కాజీపేట సోమిడికి చెందిన దామెరుపుల మొగిలి ఇటీవల హైదరాబాద్‌లోది వైల్డ్‌ఫిట్నెస్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో మాస్టర్ ఎండి.జాఫర్ ఆధ్వర్యంలో పాల్గొని బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను కాజీపేట ఆర్పిఎఫ్ సిఐ సంజీవరావు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాల వయసులోరాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ జాఫర్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులుగా బాపురావు



నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని హుస్సేన్ పల్లి గ్రా మానికి చెందిన అసాల బాపూరావుని తెలంగాణ రైతు రక్షణ సమితి మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ రైతు రక్షణ సమితి మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. గోవిందాపురం గ్రా మానికి చెందిన ఐరబోయిన తిరుప తిని ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికేల కిషన్ రావు, జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్‌కి అధ్యక్ష, కార్యదర్శులు ప్రత్యేక కఋతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు అందుబాటులో ఉండి రైతు సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తూ, వాటి పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు రక్షణ సమితి నాయకులు చౌళ్ల రామారావు, సురావు బాపూరావు, హింగే రవీందర్ పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌ను సన్మానించిన హోమియో డాక్టర్స్



నవతెలంగాణ-హనుమకొండ

ఓరుగల్లు సిటిజన్ ఫోరం వరంగల్ ఆధ్వర్యంలో ఆత్మీయ పౌర సన్మానం హన్మకొండలోని డి కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ శ్రీ నల్లు ఇంద్రసేనారెడ్డిని ఓరుగల్లు హోమియోపతి మెడికల్ అసోసియేషన్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ హనుమకొండ, వరంగల్ కమిటీ శాలువాతో సత్కరించి జ్ఞాపికను ప్రధానం చేయడం జరిగింది. అనంతరం ఆరోగ్య దర్శిని పక్షపత్రిక తొమ్మిదో వార్షికోత్సవ సంచికను గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఐహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆరోగ్య దర్శిని పక్షపత్రిక ఎడిటర్ డాక్టర్ పావుశెట్టి శ్రీధర్, ఓరుగల్లు హోమియోపతి మెడికల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ సుధాకర్ రావు, అధ్యక్షులు డాక్టర్ భీమగాని లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. రాంబాబు, ట్రెజరర్ డాక్టర్ బాసాని శ్రీకాంత్ పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో తాళ్ల పద్మావతి విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కాజీపేట

కాజీపేట మండలం సోమిడి శివారులో గల తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాసరామానుజన్ మ్యాథ్స్ ఒలంపియాడ్ రాష్ట్రస్థాయి ప్రతిభ పోటీలలో పాఠశాల విద్యార్థి కేశవ్ ఛత్రి రాష్ట్రస్థాయిలో మొదటిర్యాంకు సాధించిఇటీవల హైదరాబాద్ రవీంద్ర భారతి నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త లోక్సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను మంగళవారం తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్లమల్లేశం అభినందనలు తెలిపారు, అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని మొదటి బహుమతి సాధించడంతోపాటు అగస్త్య, అద్వైత,అభిరాం, సాయి మోక్షిత్‌లు జిల్లాస్థాయి ర్యాంకులు సాధించారాని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభనువెలికి తీసి ఉన్నత స్థాయికి చేర్చడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు, భవిష్యత్తులో విద్యార్థు లు మరిన్ని విజయాలు సాధించడం కొరకు పాఠశాల యాజమాన్యం కషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం

నవతెలంగాణ-కమలాపూర్

నిలిచి ఉన్న స్కూల్ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మండలంలోని శనిగరం గ్రామంలో నిలిచి ఉన్న స్కూలు బస్సును నడికుడ గ్రామానికి చెందిన బియాల ప్రశాంత్ రావు,ద్విచక్ర వా హనం పై, అతి వేగంతో వచ్చి ఆగి ఉన్నస్కూల్ బస్సును, ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడ ఉన్న స్థానికులు 108 కి సమాచారం ఇవ్వడంతో, అతను ఆసుపత్రికి తరలించారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని 12 ఉన్నత పాఠశాలలోని 351 మంది పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి వారి స్వంత ఖర్చులతో ఎగ్జామినేషన్ కిట్స్, భోజన వసతి ఏర్పాట్లను కల్పించారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే వారి ప్రతినిధులను పాఠశాలకు పంపి ప్రతి విద్యార్థికి పరీక్ష కిట్లు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఇర్రి రమణా రెడ్డి, బావండ్ల నాగజ్యోతి కృష్ణం రాజు, బొడిగం చంద్రారెడ్డి, ఈదులకంటి ప్రతాప్ రెడ్డి, చల్లా శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, నరేందర్, మహదేవ్, హరి, గణేష్ తిర్మల్ రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నవతెలంగాణ-పాలకుర్తి



సేవాలాల్ స్ఫూర్తితో విద్యార్థిని విద్యార్థులు లక్ష సాధన కోసం ఉన్నత శిఖరాలకు ఎదగాలని సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా అధ్యక్షులు ధారావత్ శంకర్ నాయక్ అన్నారు. సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సేవాలాల్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బమ్మెర ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లతోపాటు పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి లావుడియా అనిల్ చౌహన్, ధరావత్ ప్రకాష్ నాయక్, సహాయ కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కొడకండ్ల

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో రెండు అమలు చేయగా మరో రెండు పథకాలైన రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు సురేష్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మాట ఇచ్చిందంటే ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ తూచా తప్పకుండా సంక్షేమ ఫలాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సోమ నరసయ్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్ నాయక్, మండల నాయకులు వెంగళరావు మోహన్, సునీల్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు రవీందర్, సోషల్ మీడియా నాయకులు బత్తుల వెంకన్న, యూత్ నాయకులు యాకన్న, ఎస్సీ సెల్ అధ్యక్షులు బిక్షపతి, బీసీ సెల్ అధ్యక్షులు రమేష్, లమనోహర్, వంశీ, అంజయ్య పాల్గొన్నారు.

దేవాదుల ప్రాజెక్టు ద్వారా చెరువులు, కుంటలు నింపాలి : సీపీఎం

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలలోని చెరువులను కుంటలను దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని నింపి రైతుల పంటలకు మీరు అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం బచ్చన్నపేట మండలంలో ఆధ్వర్యంలో దేవాదుల ప్రాజెక్టు ద్వారా చెరువులను కుంటలను నింపాలని కోరుతూ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ పాల్గొని మాట్లాడుతూ మండలంలో ఉన్న 9 పెద్ద చెరువులు 30పైగా ఉన్న చిన్న చెరువులను, కుంటలను నింపి ఎండిపోతున్న పంటలకు నీరు అందించి రైతాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే వేసవికాలం సమీపిస్తున్న సందర్భంలో రెండు నుంచి మూడు మీటర్ల లోతు భూగర్భ జలాలు అడుగంటిపోయి కరువు ఏర్పడే ప్రమాదం ఉందని వారన్నారు. బచ్చన్నపేట ప్రాంతంలో వరి పంట మొక్కజొన్న పంటలు ప్రధాన పంటలుగా ఉన్నాయని బోర్ బావులు వ్యవసాయ వాగుల ద్వారా 20 వేల హెక్టార్లలో భూమిని సాగు చేస్తున్నారని, బచ్చన్నపేట ప్రాంతం ఎత్తైన ప్రాంతంగా ఉండడం వల్ల భూగర్భ జలాలు తొందరగా అడుగంటిపోయే ప్రమాదాలు ఉన్నాయని వారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించి ఆదుకోవాలని వారు కోరారు. గతంలో వడగండ్ల వాన ద్వారా వేలాది ఎకరాల పంటలు నష్టపోయి ఉన్నారని ఇప్పటివరకు రైతులకు పంట నష్టపరిహారం అందలేదన్నారు. ప్రభుత్వ అధికారులను అడిగితే ప్రభుత్వం దగ్గర నుండి నిధులు విడుదల కావడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వడగండ్ల వాన ద్వారా పంటలు నష్టపోయిన రైతన్నకి ఎకరానికి 50వేల రూపాయల నష్ట పరిహారాన్ని అందించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మినలాపురం ఎల్లయ్య, బైరగోని బలరాం, తాడెం రాములు, పర్వతం నర్సింలు, జ్ఞానయ్య కడకంచి మల్లేశం, అమ్మరాజు నర్సింలు, లక్ష్మి రాజి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





జనగామ : జనగామ మండలంలోని చెరువులను కుంటలను దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని నింపి రైతుల పంటలకు నీరు అందించాలని సీపీఎం జనగామ మండల కార్యదర్శి బోడ నరేందర్, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జనగామ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో దేవాదుల ప్రాజెక్టు ద్వారా చెరువులను కుంటలను నింపాలని కోరుతూ జనగామ తహసీల్దార్ వెంకటేష్‌కు మెమోరాండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న 17 పెద్ద చెరువులు, 30 పైగా ఉన్న చిన్న చెరువులను, కుంటలను నింపి ఎండిపోతున్న పంటలకు నీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పోతుకునూరి ఉపేందర్, అన్ని కిష్టయ్య, కాసాని మల్లేష్,కళ్యాణం లింగం, మల్లయ్య, యాదగిరి, రాములు, అంజయ్య, పోచయ్య పాల్గొన్నారు.



'పది'లో పదికి పది జీపీఏ సాధించాలి

- విద్యాశాఖ మండల నోడల్ అధికారి నర్సయ్య

నవతెలంగాణ-పాలకుర్తి

విద్యార్థినీ, విద్యార్థులు 10 పరీక్షల్లో పదికి పది జీపీఏ సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యాశాఖ మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య సూచించారు. మహాత్మ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్ సహకారంతో మంగళవారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి ఇంటర్మీడియట్ చదువుతున్న 150 మంది విద్యార్థినీలకు పరీక్ష ప్యాడ్‌లతో పాటు పెన్నులు,పెన్సిల్లను అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గురుకులాల్లో చదువుతున్న పేద విద్యార్థిని, విద్యార్థులకు చేయూతనిస్తూ సహాయం అందించడానికి మహాత్మా హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్ కృత నిశ్చయంతో ఉన్నారని అన్నారు. పరీక్షలు అంటే భయం వద్దని, లక్ష్య సాధన కోసమే పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి విద్యలో రాణించి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నదే గంట రవీందర్ ఆకాంక్షఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి బైరపాక నవీన, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి





- నోడల్ అధికారి నర్సయ్య

నవతెలంగాణ-పాలకుర్తి

స్వయం పరిపాలన దినోత్సవం ప్రతి విద్యార్థిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని సమాజ నిర్మాతలుగా మారాలని విద్యాశాఖ నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య సూచించారు. మంగళవారం మండలంలోని చెన్నూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం పురస్కరించుకొని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మరియు జ్యత్రుత అధ్యక్షతన జరిగిన సమావేశంలో నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. స్వయం పరిపాలన స్ఫూర్తి స్కిల్ డెవలప్మెంట్ పెరుగుదలకు దోహదపడతాయన్నారు. స్వయం పరిపాలనలో జిల్లా విద్యాశాఖ అధికారిగా వి.చందు, మండల విద్యాశాఖ అధికారిగా దుర్గ భవాని, మండల నోడల్ అధికారిగా మానస, ప్రధానోపాధ్యాయురాలిగా రిజ్వాన, ఉపాధ్యాయులుగా స్పందన, నవ్య, దుర్గ భవాని, అనుశ్రీ, నితిన్, శివరాం, బన్నీ, అక్షయ, దుర్గరాజు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సోమయ్య, శ్యామ్ సుందర్ రావ్, శ్రీనివాస గుప్త, శోభ, ఆర్.కవిత, లావణ్య, రమేష్, గోపాల్ జడ్జిలుగా శ్రీష్మ, కవిత, క్రిస్టఫర్ బాధ్యతలను నిర్వహించారు. స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రామవరం జిల్లా పరిషత్ పాఠశాలలో...

కొడకండ్ల : మండలంలోని రామవరం గ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులుగా పవన్, ఉపాధ్యాయులుగా సోనీ, రిజ్వాన, స్వామి, సూర్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు శ్రీహరి, సరిత, ఆంజనేయ చారి, ఉప్పలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున

నవతెలంగాణ-జనగామ

విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అన్నారు. మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో పోకల జమున, వార్డుకౌన్సిలర్లు ఎగ్జామ్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టిపెట్టారన్నారు.అందులో భాగంగానే వారికి చేయూతనందిస్తున్నారన్నారు. ఓ వైపు నీలిమా హాస్పిటల్ ద్వారా వైద్య సేవలందిస్తూనే మరో వైపు అనురాగ్ యూనివర్సిటీ ద్వారా విద్యనందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థి జీవితంలో కీలకమని చెప్పారు.త్వరలో జరగబోయే పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు.

విప్లవ కెరటం చంద్రశేఖర్ ఆజాద్

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి

స్వాతంత్రోద్యమంలో వీరోచితంగా పోరాటం చేసిన విప్లవ కెరటం చంద్రశేఖర్ ఆజాద్ అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో జరిగిన సాయుధ పోరాటంలో ఆజాద్ ప్రజల కోసం వీరమరణం పొందాడని తెలిపారు.ఆజాద్ పేరు వింటేనే బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయని గుర్తు చేశారు. ఆజాద్ పోరాట ఫలితమే బ్రిటిష్ పాలకుల కబంధహస్తాల నుండి భరతమాతకు విముక్తి కలిగిందని గుర్తు చేశారు. దేశం కోసం దేశ రక్షణ కోసం అతి చిన్న వయసులోనే ఆజాద్ ప్రాణాలను కోల్పోవడం మరువలేనిది అన్నారు. ఆజాద్ పోరాట స్ఫూర్తితో ప్రతి యువకుడు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



మండలాధ్యక్షులుగా బీసీలను ఎన్నుకోవాలి

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండల కాంగ్రెస్ మండలాధ్యక్ష పదవికి సుమారుగా పది మంది సీనియర్ నాయకులు ఆశపడుతున్నందున ఇట్టి విషయంలో కూడా ఏకపక్ష, పక్షపాత ధోరణి అవలంభించకుండా, న్యాయమైన, ప్రజాస్వామ్య బద్ధమైన విధానంలో మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ నాయకులు అందరి సమక్షంలో (ఓటింగ్) విధానం ద్వారా మండలాధ్యక్ష పదవిని ఎన్నుకుంటే బాగుంటుందని,తద్వారా రాబోయే పార్లమెంటు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలలో విజయాలు సాధించడంలో తోడ్పడుతుందని నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు చెప్పారు.




వీరన్న గుట్ట ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండల కేంద్రంలో శ్రీ వీరన్న గుట్ట ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. శ్రీ వీరభద్ర స్వామి, భద్రకాళి కళ్యాణం మహోత్సవానికి మోరం మట్టి సోసి డోజరుతో చేస్తున్న పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సత్తయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

సీఐ రాజును కలిసిన భవన నిర్మాణ కార్మికులు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ ముస్కు రాజును మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు ఆధ్వర్యంలో నాయకులతో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల అనిల్ కుమార్, ప్రచార కార్యదర్శి చింత శ్రీను, చింత వెంకటయ్య, లింగయ్య, వీరన్న రాజు, రవి, కుమార్, రమేష్, సురేష్, అయిలోని, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కొడకండ్ల




మార్చి ఒకటిన జరిగే విజయ సంకల్ప యాత్ర వాల్ పోస్టర్‌ను మహబూబాబాద్ జిల్లా బిజెపి కార్యదర్శి కొలుపుల శంకర్ పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. కొడకండ్ల మీదుగా పాలకుర్తి చేరుకుంటుందని అక్కడ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పులిగిల్ల ఉపేందర్, నాయకులు సోమన్న, కోటేశ్వరరావు, సాయి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

నవతెలంగాణ-పెద్దవంగర



పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలంటే స్వయం ప్రణాళిక, పాఠ్యాంశ పునశ్చరణతో పాటుగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల పలు రికార్డులను పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మండల నోడల్ ప్రధానోపాధ్యాయుడు బుధారపు శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం కంటే అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రధానోపాధ్యాయులు పని చేయాలన్నారు. విద్యార్థులు 10వ తరగతిలో పాసైతేనే జీవితంలో మెరుగైన స్థితిలో ముందుకు సాగుతారని తెలిపారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో వనరులు మెరుగుపడ్డాయని,విద్యార్థులు ఎంత వెనకబడి ఉన్నా మెరుగైన శిక్షణఇస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలగుతారన్నారు. వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిన విద్యార్థులు ఫెయిలైతే అది ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణం అన్నారు. గత ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రయత్నించాలన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు అత్యధిక శాతం మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లోనే వెనుకబడి ఉన్నారని, ఆలాంటి వారిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఫలితం ఉంటుందని సూచించారు. ఉత్తమ ఫలితాల కోసం ఎక్కువగా స్లిప్ టెస్టులు, మాక్ టెస్టులు నిర్వహించి వాటిపై రివిజన్ చేస్తే విద్యార్థులకు ఫైనల్ పరీక్షల భయం పోతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రతి రోజూ వేక్ అప్ కాల్ చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల వెనుకబాటుపై చర్చించి, వారికి తగు సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, అంజయ్య, సదయ్య, టకీం పాషా, వెంకన్న, శ్రీధర్, యాకన్న, విజయ్ కుమార్, శ్రీనివాస్, సువర్ణ, హైమ, కరుణ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-చిన్నగూడూరు

హిందుత్వ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, మహిళలు పోరాడాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ బండపల్లి వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో సీపీఐ(ఎంఎల్ ప్రజాపంథా), పీసీసీ సీపీఐ (ఎంఎల్), సీపీఐ(ఎంఎల్)ఆర్ఐ, ఈ మూడు విప్లవ సంస్థలు కలిసి సీపీఐ మ(ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడినవి అని అన్నారు. మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో ఐక్యత మహాసభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈకార్యక్రమంలో వెంకన్న, యాకయ్య, లక్ష్మి, రామక్క, పృధ్వీ చరణ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామ శివారు బోడతండకు చెందినగ్రానైట్ లారీ డ్రైవర్ బోడ రమేష్ (38) సోమవారం రాత్రి తిరుమలపాలెం మండల కేంద్రంలో రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో రమేష్ మృతి చెందారు. రమేష్ ఖమ్మంలో గ్రానైట్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. రాత్రి పని ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న బైక్ రమేష్ బైకులు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తీవ్రంగా గాయపడగా ఖమ్మం హాస్పిటల్‌కి తరలించగా రమేష్ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. తిరుమలయపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యం





నవతెలంగాణ-గార్ల

విద్యార్థులలో చదువుతోపాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి వారిని మరింతగా ప్రోత్సాహించడమే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు నిర్మల హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ శలెట్, ప్రిన్సిపాల్ సిస్టర్ జైస్‌లు అన్నారు. మంగళవారం స్థానిక నిర్మల హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌ల వినియోగంలో విద్యార్థులు అవుట్ డోర్ ఆటలకు దూరం అవుతూ వారిలో దాగి ఉన్న ప్రతిభకు దూరం అవుతున్నారన్నారు. విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న క్రీడాలను ప్రోత్సాహించి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదం చేస్తామని చెప్పారు. విద్యార్థులలో సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించడానికి నిర్వహించిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలను కరస్పాండెంట్ సిస్టర్ శలెట్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాలైన సైన్స్ ప్రయోగశాలన మూనాలు, వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆకట్టుకుని ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గార్ల విచారణ గురువు ఫాదర్ దిలీప్, సహాయక గురువు కిరణ్‌లు హాజరు కాగా కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సినీ, సిస్టర్స్ రోస్మిన్ జేర్లిన్, జీనా ఉపాధ్యాయులు నరేష్, ప్రవీణ్, రవి, శేఖర్, పవన్, సురేందర్, శివ కృష్ణ, బాలస్వామి, శ్రీనివాస్, నాగమాల, సరిత, శిరోమణి, కళ్యాణి, బంగారమ్మ, కరుణ, సాహితీ, రమణ, వాణి, నితిన్, సోనా, లావణ్య, రీమా, రెక్కింతి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-బయ్యారం



రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూఎలాంటి అవకతవకలు జరగకుండాఎప్పటికప్పుడు జిల్లా కేంద్రాల్లో ఉన్న పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్, మండల కేంద్రాల్లో ఎమ్మార్వో, ఎంఈఓ పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వివిధ గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులకు సరైన సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో డాక్టర్ల పర్యవేక్షణకు ఉండాలని, అదే విధంగా ఒక్క నిమిషం ఆలస్యంగా నిబంధన ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎండలు తీవ్రత ఉండటం వల్ల పరీక్ష కేంద్రాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, శివ, ప్రసాద్, అరవింద్, కృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ

నవతెలంగాణ-పాలకుర్తి



పార్లమెంటు ఎన్నికలే లక్ష్యంగా పని చేసే పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అధిక మెజారిటీ తీసుకు రావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ ప్రజలకు పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని శాతాపురం, దుబ్బ తండా (ఎస్సీ) గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అర్హులైన మహిళలకు కాంగ్రెస్ మండలాధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్‌తో కలిసి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి మహిళకు సహాయం అందించాలని లక్ష్యంతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తరహాలో పాలకుర్తి నియోజకవర్గంలో పార్లమెంటు అభ్యర్థికి అత్యధిక మెజారిటీని తీసుకువచ్చేందుకు కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని, ప్రజలు సహకరించాలని పిలుపు నిచ్చారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇన్చార్జి ఝాన్సీరెడ్డిలతోపాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూమా రంగయ్య, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాదాసు హరీష్ గౌడ్, దుబ్బ తండా ఎస్సీ శాతాపురం గ్రామాల ఇన్చార్జులు లోనే శ్రీనివాస్, పులి గణేష్, శాతాపురం గ్రామాధ్యక్షుడు కశరబోయిన కృష్ణమూర్తి, దుబ్బతండా ఎస్సీ, శాతాపురం గ్రామాల నాయకులు బానోతు కిషన్ నాయక్, కసిరబోయిన కొండయ్య, గుగులోతు నరసింహ నాయక్, భూక్య రాజన్న నాయక్, వల్లెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా వెంకటపతి



నవతెలంగాణ-బయ్యారం

మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా మండల కేంద్రంలోని జగ్గుతండా గ్రామ పంచాయతీకి చెందిన తమ్మిశెట్టి వెంకటపతిని నియమించినట్లు మంగళవారం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కంకర అయ్యప్ప రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటపతి మాట్లాడుతూ తన పై నమ్మకంతో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా నియమించిన జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ నాయకులు, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కంబాల ముసలయ్య, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ముల్యాకారి పీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు జూలకంటి సీతారామ్ రెడ్డి, గాడుదుల కేతమల్లు, కసనబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

- మండల వ్యవసాయ అధికారి కుమార్ యాదవ్



నవతెలంగాణ-పెద్దవంగర

యాసంగి పంటలకు అవసరమైన యూరియా సరఫరా చేస్తున్నామని, మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని అవుతాపురం, పోచంపల్లి, పెద్దవంగర గ్రామాల్లోని ఆగ్రోస్, పీఏసీఎస్ ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 67 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. యూరియా కొరత లేదని చెప్పారు. గతంలోనే 180 మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్ పెట్టామని రెండు రోజులు యూరియా మండలానికి చేరుతుందని చెప్పారు. యూరియాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, యాసంగి పంటలకు అవసరమయ్యే యూరియా సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

తొర్రూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం..?

- పట్టణంలో జోరుగా సాగుతున్న చర్చ
- ఆచీ...తూచీ... అడుగులు వేస్తున్న కాంగ్రెస్



నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి పావులు కదులుతున్నాయా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. ఈవిషయంపై పట్టణంలో జోరుగా చర్చ సాగుతుంది. టీఆర్ఎస్ కౌన్సిలర్లు కొంతమంది కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు సమాచారం. దీనితో ఈ ప్రచారానికి బలం చేకూరినట్లు అవుతుంది. తొర్రూరు మున్సిపల్ పరిధిలో 16 వార్డులు ఉన్నాయి. చైర్ పర్సన్ స్థానం ఎస్సీ రిజర్వుడు. 16 వార్డుల్లో ఏడవ వార్డు (బీఆర్ఎస్) కౌన్సిలర్ మృతి చెందాడు. దీంతో ఈ స్థానం గత కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. నేటికీ ఎన్నికలు నిర్వహించలేదు. మిగిలిన 15 వార్డుల్లో 11 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్, ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్, ఒక కౌన్సిలర్ బీజెపి నుండి ఎన్నికైన వారు ఉన్నారు. 15లో 8 మంది మహిళ కౌన్సిలర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా చైర్‌పర్సన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే 9 మంది కౌన్సిలర్ల సంపూర్ణ మద్దతు కావాల్సి ఉంది. ఈ మద్దతు కాంగ్రెస్ సంపాదిస్తే స్థానిక ఎమ్మెల్యే ఓటుతో పదిమంది మద్దతు లభిస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఆరుగురు టీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై కాంగ్రెస్ అధిష్టానం ఆచీ.. తూచీ... అడుగులు వేస్తుంది. అవిశ్వాసం పెడితే మద్దతు నిలుస్తుందా..? తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయి..? వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై ఈ మార్పు ప్రభావం ఏమైనా పడుతుందా..? అన్న కోణాల్లో సమాలోచనలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే త్వరలోనే మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారు కావచ్చు అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇదే నిజమైతే అదే సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్ (కాంగ్రెస్)పై కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇతను కాంగ్రెస్ నుండి గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్ళారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఇదే సామాజిక వర్గానికి చెందిన మరో ఇద్దరు కౌన్సిలర్లు ప్రస్తుతం టిఆర్ఎస్‌లో ఉన్నారు. ఒకే సామాజిక వర్గం కావడంతో వీరి మద్దతు లభిస్తుందా..? లేదా..? వీరితోపాటు మరో నలుగురు కౌన్సిలర్లు పార్టీ మారితే ఎలా ఉంటుందని ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ బీఆర్ఎస్ విప్ జారీ చేస్తే విప్‌కు అనుకూలంగా హాజరై ఓటు వేస్తారా..? లేక సమావేశానికి దుమ్మ కొడతారా..? సమావేశానికి దుమ్మా కొడితే చైర్‌పర్సన్ విశ్వాస పరీక్ష నెగ్గలేడు. చైర్ పర్సన్ కుర్చీ హస్తగతమవుతుంది.

ఎవరికి దక్కినా 11 నెలలే...

తొర్రూరు మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెడితే చైర్‌పర్సన్ కుర్చీ ఎవరికి దక్కిన 11 నెలల సమయం మాత్రమే ఉంది. ఈ 11 నెలలకు ఇదంతా అవసరమా..? అని కాంగ్రెస్ భావిస్తే యథావిధిగా టిఆర్ఎస్ చైర్‌పర్సన్ కొనసాగుతారు. లేకుంటే మార్పు తధ్యం అని పరిశీలకులు భావిస్తున్నారు. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే..!?

ఆయిల్ పామ్ సాగుపై రైతులు మొగ్గు చూపాలి

- జిల్లా ఉద్యవాన శాఖ అధికారి కే.సూర్యనారాయణ



నవతెలంగాణ-మరిపెడ

కోతుల నుండి, చీడ పీడల నుండి నష్టం లేకుండా ఉండాలంటే రైతులు ఆయిల్ పాం సాగుపై మొగ్గు చూపాలని జిల్లా ఉద్యావన శాఖ కె సూర్యనారాయణ రైతులకు సూచించారు. మంగళవారం మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామరెవెన్యూ పరిధిలో రైతు కసనబోయిన రవి ఆయిల్ పామ్ క్షేత్రంలో మరిపెడ మండలంలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న 122మంది రైతులు 554 ఎకరాల విస్తీర్ణం గల వారితో ఆయిల్ ఫామ్ సాగులో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు మెళకువలు గురించి రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులకు ఆయిల్ పామ్ పంట యొక్క ఆవశ్యకత సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. మార్కెటింగ్, రవాణా, కాత విషయంలో రైతులు ఆచరించవలసిన పద్ధతులను ఉత్సాహం ఉన్నటువంటి అయితే రైతులు ఈ పంట సాగుకు ముందుకు రావాలని కోరారు. డోర్నకల్ నియోజక వర్గస్థాయి ఉద్యాన అధికారి అనిత శ్రీ మాట్లాడుతూ బిందు సేద్య నిర్వహణ మొదటి రెండు సంవత్సరాలు లేత తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఆయిల్ పామ్ పంట మంచి భవిష్యత్తు ఉన్నటువంటి పంట చీడ, పీడలు, కోతుల బెడద లేదు. దొంగల బెడద లేదు. మంచి మార్కెటింగ్ ఉన్నటువంటి పంట కాబట్టి రైతులంతా ఈ పంటలపై దృష్టి సారించాలన్నారు. జైన్ డ్రిప్ ఇరిగేషన్ జోనల్ మేనేజర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ డ్రిప్పు యొక్క నిర్వహణ ఎరువుల యాజమాన్యం పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో బిందు సేద్య ప్రతినిధులు ప్రసాద్ బాబు, డీలర్ తాడూరి వీరన్న, కంపెనీ ప్రతినిధులు ఫీల్డ్ ఆఫీసర్ ఎల్లయ్య శివ కుమార్, నగేష్, ఆయిల్ ఫెడ్ పున్నం చందర్, సాగు రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంతు సేవలాల్ జయంతి విజయవంతం చేయాలి

- జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి నాయక్



నవతెలంగాణ-మరిపెడ

రేపు మరిపెడలో జరిగే సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్టీ సెల్ నాయకులు గుగులోతు రవి నాయక్ అన్నారు. మంగళవారం మరిపెడ ఎంపీడీవో కార్యాలయంలో సంతు సేవలాల్ జయంతి వేడుకలు ఏర్పాట్లను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ నాయక్ మాట్లాడుతూ శ్రీశ్రీ సంతు సేవాలాల్ మహారాజా 285 జయంతి ప్రభుత్వం పరంగా అధికారికంగా మరిపెడ మండల జరిగే డోర్నకల్ నియోజకవర్గం స్థాయి సమావేశం బోగ్‌బండార్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, ఇతర ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మరిపెడ మండలాధ్యక్షులు అజ్మీర శ్రీను, నాయకులు తేజావత్ నెహ్రూనాయక్, మాజీ సర్పంచ్ భూక్యా కృష్ణా నాయక్, బానోతునరేష్, జరుకుల విజయ నాయక్, భూక్యా మంగిలల్ నాయక్, బానోత్ మహేష్, బానోత్ పాపాలాల్ నాయక్, భానోత్ వీరన్న, బానొట్ శరత్, గుగులోతు రాజేష్, గుగులోతు శ్రీనివాస్, బానోత్ బోడియా, బానోత్ మల్సూర్, గూగులోతు శ్రీనుగన్ను నాయక్ పాల్గొన్నారు.

నల్లబెల్లం, పట్టిక పట్టివేత - ముగ్గురిపై కేసు నమోదు



నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు డివిజన్ పరిధిలోని నర్సింహులపేట మండలం జయపురం, రామన్నగూడెం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం నరసింహులపేట పోలీసులు 30 క్వింటాల నల్లబెల్లం, రెండు క్వింటాల పట్టికి స్వాధీనపరుచుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. నరసింహులపేట ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహులపేట మండలం జయపురం, రామన్నగూడెం గ్రామాల మధ్య క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం పోలీసు వాహన తనిఖీ చేస్తుండగా ఒక నెంబర్ లేని వాహనం పోలీసులను చూసి దూరంగా ఆపుకొని వాహనాన్ని తిప్పుకొని వెళ్లడానికి ప్రయత్నం చేస్తుండగా అనుమానం వచ్చి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 60 బస్తాలు 30 క్వింటాళ్ల నల్ల బెల్లం, 200 కేజీల పటికి కనిపించిందని తెలిపారు. దీనికి సంబంధించి దాసు తండాకు చెందిన గుగులోతు వీరన్న, గూగుల్ హేమ, గుగులోతు శ్రీనులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. వీరు చిత్తూరు నుండి బెల్లం తీసుకొని వచ్చి తండాలో అమ్ముతున్నట్లు తెలిపారు. నల్లబెల్లం, పట్టిక విలువ 3లక్షల20 వేల రూపాయలు ఉంటుందన్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, బెల్లం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ గండ్రాతి సతీష్ తెలిపారు. ఇకముందు ఎవరైనా నిషేధిత బెల్లం, పట్టిక, గంజాయి, గుడుంబా తయారీ వంటి చట్ట వ్యతిరేక పనులు చేసినా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు.




ప్రజల ఆశీస్సులతో ఆరు గ్యారెంటీల అమలు

- కాంగ్రెస్ మండలాధ్యక్షులు సంతోష్

నవతెలంగాణ-తొర్రూరు

ప్రజల ఆశీస్సులతో ఆరు గ్యారంటీలు అమలు జరుగుతున్నాయని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమరాజ శేఖర్ అన్నారు అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం ప్రభుత్వం ప్రారంభించిన సందర్భంగా మంగళవారం సాయంత్రం డివిజన్ కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి మొదటి వారం నుంచి గృహజ్యోతికి అర్హులైన వారందరికీ ఈ పథకం కింద జీరో బిల్లులు జారీ చేస్తారని తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉండి, 200 యూనిట్లలోపు గృహ విద్యుత్ వినియోగించే వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ హామీ అమలుతో మహిళలకు వంట కష్టాలు తీరబోతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, త్వరలో రూ.2 లక్షల రుణమాఫీ కూడా చేస్తారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలు ప్రభుత్వం భర్తీ చేసిందని పేర్కొన్నారు. మరో 6 వేల ఉద్యోగాలను భర్తీ చేయబోతుందని, యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు 10 స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయబోతుందని తెలిపారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గుర్తూరులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు కాబోతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నర్కుటి గజానంద్, భూసాని రాము, తూనం రోజా, నర్కుటి గజానంద్, కాంగ్రెస్ నాయకులు చెవిటి సధాకర్, హనుమాండ్ల నరేందర్ రెడ్డి, జాటోత్ రవి నాయక్, వెంకట సాయిలు, బచ్చలి లక్ష్మణ్, లాక్య నాయక్, రామచంద్రయ్య, బి.వెంకన్న యాదవ్, రామ్మూర్తి, కిషన్ రెడ్డి, సోమిరెడ్డి, అశోక్, సాగర్, యాదవ్, కర్ర అశోక్ రెడ్డి, సంతోష్ నాయక్, కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జామాయిల్ తోటలో నిప్పు



నవతెలంగాణ-బయ్యారం

ప్రమాదవశాత్తు నిప్పు అనుకొని జామాయిల్ తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని కాకతీయనగర్ ప్రాథమిక ఉపకేంద్రం సమీపంలో గల జామాయిల్ తోటలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని, సమీప ప్రజలతో కలిసి మంటలను ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని సమీప ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు దూసుకు పోవాలి

- వరంగల్ నిట్ ప్రొఫెసర్ దినకర్, డీఈవో రామారావు
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్



నవతెలంగాణ-పెద్దవంగర

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు దూసుకు పోవాలని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ దినకర్, మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, లయన్ వెంకటేశ్వర్ రావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈయన సందర్భంగా విద్యార్థులు చేసిన సైన్స్ నమూనాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను శాస్త్రీయ దృక్పథాన్ని వెలికి తీయాలని, సమాజానికి దిక్సూచిలా విద్యార్థులు ఎదగాలని, సైన్స్‌తోనే మానవ మనగడ ముడిపడి ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు బోధనోపకరణాలతో బోధిస్తే విద్యార్థులు సబ్జెక్టును సులభంగా అర్థంచేసుకుంటారన్నారు. సర్ సీవీ. రామన్ పరిశోధన ఫలితాన్ని ధ్రువీకరించిన రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎర్ర వెంకన్న మాట్లాడుతూ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు సైన్స్‌లో రాణించాలన్నారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కుమార్ యాదవ్, ఉద్యానవన శాఖ అధికారి రాకేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ లక్ష్మీనరసింహారావు, వేలూరి శారద, సుంకరనేని నాగవాణి, దామెర సరేష్, వజినపెల్లి శైలజ, మొర్రిగాడుదుల శ్రీనివాస్, పెద్దవంగర నోడల్ ప్రధానోపాధ్యాయుడు బుధారపు శ్రీనివాస్, ముత్తినేని శ్రీనివాస్, తంగళ్ళపల్లి మల్లికార్జున చారి, ఏదునూరి రేణుక, జలగం సతీష్, అనపురం రవి గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ఉపాధ్యాయులు శ్రీధర్, హైమ, సురేష్, సురేందర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీ పథకాలు అమలు

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముద్దసాని సురేష్



నవతెలంగాణ-పెద్దవంగర

కాంగ్రెస్ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం మండల అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా గతంలో రెండు పథకాలను అమలు చేసిన ప్రభుత్వం, మరో రెండు పథకాలను అమలు చేయడం పట్ల హర్షం చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, జిల్లా కార్యదర్శి పూర్ణచందర్, పన్నీరు వేణు, బానోత్ సీతారాం నాయక్, జాటోత్ వెంకన్న, దాసరి శ్రీనివాస్, ఆవుల మహేష్, కాలేరు కరుణాకర్, గద్దల ఉప్పలయ్య, చిలుక దేవేంద్ర సంజీవరావు, బెడద మంజుల, చిలుక సంపత్, మద్దెల యాకన్న, రామ్‌చరణ్, స్వామి, రవి, అనపురం వినోద్, జలగం పవన్, బొబ్బెడ వెంకన్న, మందపూరి సందీప్, ముద్దసాని హరి, కొత్త ప్రభాకర్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని బేరువాడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ కనకదుర్గ ఆలయ కమిటీకి 18,018 రూపాయలు (50 బస్తాల సిమెంట్) భారీ విరాళాన్ని చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ ఇటీవల వివిధ గ్రామాల్లో గుడి నిర్మాణాల అలంకరణ కొరకు గ్రానైట్‌ను అందజేయడం అదేవిధంగా ఇప్పుడు కనకదుర్గమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి నా ద్వారా ఈ విరాళాన్ని అందజేయడం అదృష్టంగా భావించి దుర్గమ్మ తల్లి నాకు ఈ అవకాశం కల్పించినందుకు సంతోషిస్తూ ఆలయ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఎంపీటీసీ బోడ కవితా రాజేందర్, మాజీ ఉప సర్పంచ్ రాజమణి బీముడు, ఆలయ కమిటీ సభ్యులు అడిగిన వెంటనే మాకు సహాయాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు దామర కొండ ప్రవీణ్, గుగులోత్ మామ్, జి.హచ్యా, బోడ లక్‌పతి, చిన్నహచ్యా, రాజు నాయక్ పాల్గొన్నారు.



ఐహెచ్‌హెచ్‌ఎల్‌ను పరిశీలించిన డిఎల్‌పిఓ

నవతెలంగాణ-నెల్లికుదురు

మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఐహెచ్‌హెచ్‌ఎల్ పనులను పరిశీలించినట్లు డిఎల్‌పిఓ గంగాభవాని తెలిపారు. మంగళవారం ఎంపీడీవో బాలరాజుతో కలిసి గ్రామంలోని ఐహెచ్‌ఎల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో గతంలో నిర్మించుకున్న ఐహెచ్‌ఎల్ పూర్తికానివారు ఉన్నారని, ఇప్పుడు వాటిని పూర్తి చేసుకున్న వారికి పూర్తిస్థాయిలో ప్రభుత్వ అందించే డబ్బులు వస్తున్నాయన్నారు. ఆన్లైన్లో చూపించిన వారి పేర్ల మీద ఉన్న లిస్టును చూసి లొకేషన్ వెళ్లి నిర్మించుకున్నటు వంటి మరుగుదొడ్లను అప్లోడ్ చేస్తున్నామన్నారు. ఈ ఆన్లైన్‌లో అప్లోడ్ చేసిన తర్వాత వీరికి పూర్తి స్థాయిలో బిల్లు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు, ఎంపిఓ పార్థసారథి, ఎస్‌బి జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజమణి పాల్గొన్నారు.



పదవ తరగతి విద్యార్థులు 10/10 జీపీఏ సాధించాలి

- గూడూరు స్పెషల్ ఆఫీసర్ ఎర్రయ్య

నవతెలంగాణ-గూడూరు

పదవ తరగతి విద్యార్థులు 10/10 జీపీఏ సాధించాలని గూడూరు మండల స్పెషల్ ఆఫీసర్, మహబూబాబాద్ గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎం.ఎర్రయ్య అన్నారు. మంగళవారం గూడూరు మండల కేంద్రంలోని జెడ్పిఎస్ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు భయాందోళన చెందవద్దని లక్ష్యంతో చదివి 10/10 ప్రభుత్వ పాఠశాలల నుండే మండల టాపరులుగా నిలవాలని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆశించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- చీఫ్ సూపరింటెండెంట్ గాదేగోని సుమన్

నవతెలంగాణ-గూడూరు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదని ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ గాదేగోని సుమన్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో దామరవంచ ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల, బ్రాహ్మణపల్లి కస్తూర్బా బాలికల కళాశాల, జ్యోతి పూలే కళాశాలల నుండి ప్రథమ సంవత్సరానికి చెందిన 228 మంది విద్యార్థులు ద్వితీయ చదువుతున్న 187మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రం లోనికి ఉదయం 8:30 వరకు తప్పక హాజరుకావాలని ఉదయం 9 గంటల నుండి 12:00 వరకు పరీక్షలు నిర్వహించబడునని పరీక్ష కేంద్రం నుండి 100 మీటర్ల వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు బుక్ స్టాల్‌లు మూసివేయాలని మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు విద్యార్థులు పరీక్షలకు కావాల్సిన హాల్ టికెట్, పెన్ను, ప్యాడ్ తప్పక తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

అవసరాలకు తగ్గట్లుగా పుస్తకాలు ఉండాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.కవిత



నవతెలంగాణ-మరిపెడ

సామాజిక అవసరాలకు తగ్గట్లుగా మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కవిత అన్నారు. మంగళవారం ఆంగ్ల ఉపన్యాసకులుగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసు వ్రాసిన స్పీక్ లైక్ ఎ చాంప్ యాన్ ఇన్నోవేటివ్ అప్రోచ్ టు మాస్టర్ స్పోకెన్ ఇంగ్లీష్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కవిత మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో వ్యక్తిగత, వృత్తిపరమైన రంగాల అభివృద్ధికి కావాల్సిన స్పోకెన్ ఇంగ్లీష్ స్కిల్స్‌ను స్వయంగా నేర్చుకోవాలనుకునే వారికి ఉపయోగపడే విధంగా ఓసమగ్ర గ్రంధాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. సమాజ అవసరాలకు తగ్గట్టుగా తన అనుభవాలను, పరిజ్ఞానాన్ని ఉపయోగించి, పరిశోధించి ఈ పుస్తకాన్ని అందించారని ఈ పుస్తకాన్ని చదవడం ద్వారా ప్రారంభంలోనే అర్థమవుతుందని, ఇలాంటి ప్రయత్నాన్ని ప్రోత్సాహిస్తే మరిన్ని మంచి పుస్తకాలు వస్తాయని అమె అభిప్రాయపడ్డారు. సమాజ సంక్షేమం కోసం ఆలోచించే మరిన్ని పుస్తకాలను శ్రీనివాస్ వ్రాయాలని కోరారు. ఈకార్యక్రమంలో అకాడెమిక్ కోఆర్డినేటర్ ఏజే రామారావు, యన్‌యస్‌యస్‌పిఒ టి.వెంకన్న, లెక్చరర్లు నాగలక్ష్మి, వీరన్న, వెంకటరెడ్డి, పవన్, యాకూబ్, ఆఫీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాదిగలకు అవకాశం కల్పించాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గంటి రమేష్ మాదిగ

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చాగంటి రమేష్ అన్నారు. మంగళవారం మరిపెడ(బంగ్లా)లో స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. చాగంటి రమేష్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు, రవి మాదిగ, జినక స్వామి అక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాదిగ మాట్లాడుతూ మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో మాదిగలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలలో చైర్మెన్ లేదా వైస్ చైర్మన్ తప్పకుండా మాదిగలకు ఏదో ఒక దగ్గర తప్పకుండా చోటు కల్పించాలన్నరు. ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్‌గా మాదిగలకు అవకాశం కల్పించాలన్నారు. మాదిగలకు ఓటు బ్యాంక్ గానే వాడుకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సీమ సురేష్ మాదిగ, వంగూరి, వెంకటేశ్వర్లు, ఎంఎస్పి జిల్లా నాయకులు బాషిపంగు రవికాంత్, శాగంటి ప్రశాంత్ మాదిగ, బాషిసుగు రమేష్ మాదిగ, యాకన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరన్న

నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరన్న కోరారు. మంగళవారం ఉమ్మడి నరసింహులపేట మండల సీపీఎం సమావేశం బండి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరన్న హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తానన్న ఇండ్లు, ఇళ్ల స్థలాలను తక్షణమే ఇవ్వాలని, పెన్షన్ 4000 రూపాయలు ఇవ్వాలని, మంచినీటి సమస్య తీవ్రతను గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ అర్హులందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లోకి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, రైతులకు ఒకే విడతలో రెండు లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గునిగంటి మోహన్ మాట్లాడుతూ అర్హులందరికీ తక్షణమే రేషన్ కార్డ్స్ ఇవ్వాలని డబల్ బెడ్ రూమ్స్ అర్హులకు కట్టినటువంటి వాటిని ఇవ్వాలని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్, కురంది సురేష్, సిపిఎం మండల కార్యదర్శి భానుసర్వాన్, కాగిత వీరయ్య, జక్కుల లింగయ్య, నకిరకంటి స్వామి, కొమ్మినేని రామేశ్వరం, కొమ్మినేని వెంకటరమణ, బాష్పంగు వెంకటయ్య, మిడతపల్లి వెంకటయ్య, మధు, యాదగిరి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ, తహసీల్దార్‌కు సన్మానం



నవతెలంగాణ-మల్హర్‌రావు

ఇటీవల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్యాం సుందర్, తహసీల్దార్ రవికుమార్‌ను మంగళవారం ఎంపీపీతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం మండల కేంద్రమైన తాడిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతలపల్లి మలహల్‌రావు అధ్యక్షతన వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై మండల స్పెషల్ అధికారి అవినాష్, ఎంపిడిఓ శ్యాం సుందర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ ఏఈ అశోక్, డీటీ శ్రీనివాస్, ఏపీఓ విక్రమ్, మిషన్ భగీరథ ఏఈ హరిత, వళ్లెంకుంట ఎంపీటీసీ ఏనుగు నాగరాని, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, ప్రసాద్, ప్రవీణ్, శేఖర్, రాజు, చరణ్, రమేష్, సతీష్, కుమారస్వామి, శివ, సమ్మరాజు, సరిత, భాస్కర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి : గ్రామస్థులు



నవతెలంగాణ-గణపురం

మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన ఏంజాల శ్రీనాథ్(బన్నీ) కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన బన్నీ చిన్న వయసులోనే సర్వీసింగ్ సెంటర్‌లో కూలిపని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చెల్పూర్ గ్రామం సగరవీధికి చెందిన ఎంజాల దేవేందర్, నాగమణి దంపతుల కుమారుడు ఎంజాల శ్రీనాథ్(బన్నీ) సోమవారం భూపాలపల్లి దగ్గర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో హన్మకొండలోని శ్రీనివాస పినకీల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతు న్నాడు. డాక్టర్స్ తలకు ఆపరేషన్ చేయాలని, రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో బన్నీ కుటుంబానికి దాతలు ఆర్థిక సహాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

కొయ్యూర్ అడవుల్లో కార్చిచ్చు ?

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని కొయ్యూర్ రేంజ్ పరిధిలోని మల్లారం బిట్ పరిధిలో అడవి అబాయరణ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి కార్చిచ్చు రగులుతోంది. ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ ట్యాంక్, గుట్టల ఆవరణలో అగ్ని ప్రమాదం సంభవించడంతో విలువైన అటవీ సంపద అగ్నికి ఆహుతవుతోంది. అడవిలో పక్షిజాతులు, సారిసపాలు, వన్యప్రాణులు భయంతో పరుగులు పెట్టే ప్రమాదం పొంచి ఉంది. వేసవికి ముందే అడవుల్లో అగ్ని రాజుకోవడంపై అటవీశాఖ అధికారులు అప్రమత్తమై అడవులను కాపాడాలని పలువురు ప్రకృతి ప్రియులు కోరుతున్నారు. భూపాలపల్లి జిల్లా ఫారెస్ట్ డివిజన్ లోని కొయ్యూర్ రేంజ్ పరిధిలో 14వేల170 హెక్టార్లు(35వేల ఎకరాలు) అటవీ భూమి ఉంది. అడవులు కాలడానికి ముఖ్య కారణం తునికాకు సేకరణకు ముందు ప్రూనింగ్‌కు





బదులుగా అడవులను కాలుస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే అడవుల్లో తిరిగే వ్యక్తులు బీడీలు, సిగరెట్‌లు తాగి వాటిని ఆర్పేయకుండానే వాటిని పడవేయడంతో రాలిన ఆకులకు అంటుకొని వేప, దేవాదారి, నల్లమద్ది వంటి గట్టి చెట్లకు తాకడంతో మంటలు వచ్చే అవకాశం ఉంది.



అవగాహన పెంపొందించుకోవాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ - ములుగు

ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకొని, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆర్థిక అక్షరాస్యత వారం-2024లో భాగంగా కలెక్టరేట్ వద్ద 2కే రన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టరేట్ కార్యాలయం నుండి 2కే రన్ బండారుపల్లి గిరిజన భవన్ వరకు అక్కడి నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు ఆర్థిక అక్షరాస్యత వారాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం రాజ్ కుమార్, డీఆర్డీఓ శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-వాజేడు

ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలని, లేదంటే విష జ్వరాలు ఇతర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ అన్నారు. మంగళవారం గుమ్మడి దొడ్డి గ్రామం లో ఇంటింటి సర్వే వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జ్ఞానస, హెల్త్ సూపర్ వైజర్ కోటి రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు, శేఖర్, లలిత కుమారి, మాలతి, కౌసల్య, కుసుమ పాల్గొన్నారు.

రాజుపేటను మండలంగా ప్రకటించాలి

ఆదివాసీ గిరిజన సంఘం

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని రాజుపేట గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చౌలం సాయిబాబు, సోయం సీతయ్యలు తహసీల్దార్ భైరి వీరస్వామికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజుపేట చుట్టూ పక్కల సుమారు 16 గ్రామాలు ఉన్నాయని ఈ గ్రామాలన్నీ మా ప్రాంతాల్లో ఉండడంతో వివిధ అవసరాల నిమిత్తం మంగపేట మండల కేంద్రం లోని ప్రభుత్వ కార్యాలయాలకు రావడం ఇబ్బందిగా మారిందన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు అధికంగా వుండే ఈ గ్రామాల నుండి రవాణా సదుపాయాలు అంతగా లేవన్నారు. విపరీతంగా పెరిగిన బస్, ఆటో ఛార్జీల భారం కూడా ప్రజలు మండల కేంద్రం రాకపోవాడానికి మరో కారణమన్నారు. రాజుపేట చుట్టు పక్కల ఉన్న ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాజుపేట గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని సీతయ్య, సాయిబాబులు అధికారులను కోరారు.

ముగిసిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

జిల్లాలో జరిగిన టెక్నికల్ పబ్లిసిటీ కోర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రాంకుమార్ తెలిపారు మంగళవారం జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించిన పరీక్షా కేంద్రంలో ఉదయం, సాయంత్రం లోయర్ డ్రాయింగ్‌కు 150 మంది దరఖాస్తు చేసుకోగా 99 మంది హాజరైనట్లు, 51 మంది గైర్హాజరైనట్లు డ్రాయింగ్ హయ్యర్ విభాగంలో 20 మంది దరఖాస్తు చేసుకోగా 18 మంది హాజరైనట్లు ఇద్దరు గైర్హాజరైనట్లు టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ హైయ్యర్ విభాగంలో 6 గురు దరఖాస్తు చేసుకోగా 6 గురు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రామ్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మండల రవీందర్ రెడ్డి తెలిపారు. ఇదే క్రమంలో మండల విద్యాశాఖ అధికారి అజ్మీరా దేవ నాయక్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ పట్ల, మౌళిక వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భూపాలపల్లి పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ నెల్లుట్ల లక్ష్మీ ప్రసన్న, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ భానోత్ సేవ నాయక్, సిట్టింగ్ స్క్వాడ్ బాదావత్ బాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్, పరీక్షల సహాయకులు కుసుమ కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ గౌసొద్దీన్, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.



నీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నవతెలంగాణ-భూపాలపల్లి

రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మిషన్ భగీరథ, ఆర్డ బ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మండల ప్రత్యేక అధికా రులు, ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మండలాల వారిగా తాగునీటి సమస్యలు గుర్తించాలని అన్నారు. బోర్లు, హ్యాండ్ పంప్స్, పైప్ లైన్ లీకేజీలు, ఓహెచ్‌ఎస్‌ఆర్ నీటి ట్యాంకులు, గేట్ వాల్స్ లీకేజీలు, పైప్ లైన్ మరమ్మత్తులు, నూతన నల్లా కనెక్షన్లకు కావాల్సిన అంచనాలను తయారు చేయాలన్నారు. గ్రామాల్లోని మంచినీరు సరఫరా కానీ గృహాలను గుర్తించి నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు,



అన్ని శాఖల సంక్షేమ వసతి గృహాలకు నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, టీఎస్ఎంఐడీసీ, టి ఫైబర్, బీఎస్ఎన్ఎల్, గిరిజన సంక్షేమ శాఖల పర్యవేక్షణలో చేపట్టే పనుల వల్ల ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ పైపు లైన్లు ధ్వంసమై నీటి సరఫరా నిలిచిపోతుందని అన్నారు. ఎవరైనా రోడ్లకు ఇరువైపుల తవ్వకాలు జరిపే ముందు అనుమతి తీసుకోవాలని తెలిపారు.

పనులపై సమగ్ర నివేదికలు అందించాలి

గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమగ్ర నివేదికలు అందించాలని ఎంపీడీఓలను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం పంచాయతీరాజ్ అధికారులతో ఇంటి పన్నుల వసూళ్లు, పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై సమావేశం నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై నివేదికలు అందచేయాలని చెప్పారు. మంజూరై ఇంకా చేపట్టని పనులను రద్దు చేయాలన్నారు. గ్రామ పంచా యతీ అనుమతి లేకుండా నిర్మించే అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో చేపట్టాల్సిన పనులపై ముందుస్తుగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్ల ప్రక్రియ వందశాతం సాధించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విజయ లక్ష్మీ, మిషన్ భగీరథ ఈఈ నిర్మల, డీఆర్డీఓ నరేష్, డీపీఓ నారాయణరావు ఉన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

- **ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్**

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

జిల్లా కేంద్రానికి అన్ని మండలాల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో జరిగిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా



వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలలో, మండలాలలో విద్యార్థులకు పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయంలో చేరు కునేలా బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహాదేవపూర్, పలిమెల పం కెన, మహాముత్తారం, చిట్యాల, రేగొండ తదితర ప్రాంతాలలో ఎస్ఎంఎస్ హాస్టల్స్ లేక విద్యార్థులు ఇంటి నుంచి కళాశాలకి వచ్చే పరిస్థితి ఉందని అన్నారు. వారు కూడా సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకునేలా బస్ సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నూరి రాజు, విష్ణు వంశీ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ - ములుగు

ములుగు మండలం లోని కొన్ని ప్రయివేట్ పాఠశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, సబంధిత పాఠశాలలపై ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి అన్నారు. జిల్లా అధ్యక్షులు గుగులోత్ రమేష్ అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రవి పాల్గొని మాట్లాడుతూ ములుగు మండలంలోని పాఠశాల గదులు ఇరుకుగా



ఉన్నాయని, విద్యార్థులకు సరైన గ్రౌండ్ కూడా లేదని అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేవని, తరగతి గదిలో ఫ్యాన్‌లు కూడా సరిపోను లేవన్నారు. మండలం లోని ఓ ప్రయివేట్ పాఠశాల రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్నారని, విచా రణ జరిపి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భైరేష్, బాలు, రాంప్రసాద్, స్వామి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతర అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- **తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం**

ములుగు జిల్లా అధ్యక్షులు దుగ్గి చిరంజీవి

నవ తెలంగాణ-గోవిందరావుపేట

మేడారం జాతర అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు దుగ్గి చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పస్రా గ్రామంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం కమిటీ సభ్యులు వంకా రాములు అధ్యక్షతన జరిగింది. చిరంజీవి హాజరై మాట్లాడారు.



మేడారం జాతరకు వచ్చిన సందర్శకులు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లు విడుదల చేయగా సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగా ఉన్నాయని, అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలన్నారు. జాతర అనంతరం చుట్టుపక్కల గ్రామాల్లో పారిశుధ్య పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. సందర్శకుల సౌకర్యార్థం 100 పడకల ఆస్పత్రి నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్, ఊకె ప్రభాకర్, అలెం అశోక్, కుర్సం ప్రవీణ్, తోలేం కృష్ణయ్య, ఇర్ప శ్రీనివాస్, కోటే కృష్ణారావు, చందా లక్ష్మి నారాయణ, పూనెం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



నేడు రాష్ట్ర సదస్సు : ఏఐవైఎఫ్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నేడు వరంగల్ ఎల్బీ కళాశాల జనసేన ఆడిటోరియంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 8 దశాబ్దాల స్వాతంత్రంలో కేంద్ర ప్రభుత్వం యువత శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేసిందన్నారు. దేశంలో 45 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిందని అన్నారు. డిగ్రీలు, పీజీలు, పీహెచ్డీలు, బీటెక్,ఎంటెక్ లు ఎంబీఏ, ఎంసీఏ, లా కోర్సులు చదివిన వారు కూడా చివరికి రైల్వే గ్యాంగ్ మెన్ ఉద్యోగాలకు, పోలిస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు లక్షల్లో పోటీ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యరంగ నిర్వీర్యంకు నూతన జాతీయ విద్యా విధానం -2020 ప్రవేశపెట్టి అమలుచేస్తుందని అన్నారు. రాజకీయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, రాజకీయ పార్టీలపై చేస్తున్న కక్ష సాధింపు చర్యలను దేశ ప్రజలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆరబోయిన వెంకటేష్, తిరుపతి, కౌశిక్, రమేష్, చారి, తదితరులు పాల్గొన్నారు.



మెపా జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ -కోల్ బెల్ట్


జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్-తెలంగాణ) జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. రేగుల మొగిలి ముదిరాజ్ అధ్యక్షత వహించగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులుగా పుట్ట తిరుపతి ముదిరాజ్ ఏడిఈ, ప్రధాన కార్యదర్శిగా కౌటం రమేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా పడమటి నరేష్ ముదిరాజ్ ఏడిఇ, చెక్క బాబురావు ముదిరాజ్, సంయుక్త కార్యదర్శిగా సమ్మటి కృష్ణ, అల్లి రాజు, ఆకుల రాజ్ కుమార్, ఆకుల రాకేష్, కోశాధికారిగా జోరు ఈశ్వర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా కొలిపాక నరసింహారావు, న్యాయ సలహాదారుగా రెడ్డి ప్రణయ్, కార్యవర్గ సభ్యులుగా కౌటం సాంబయ్య, కౌటం కమలాకర్ ఎన్నికయ్యారు. ముదిరాజ్ సంఘాలు ఐక్యంగా మన రిజర్వేషన్ ఫలాలు అందేలా ఉద్యమాలు చేయాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా విద్య, ఉద్యోగ సాధికారత కోసం మెపా పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి పెండెం మధుసూదన్, నాయకులు కొత్తగట్టు కృష్ణ స్వామి, పులి ప్రభాకర్, గుల్ల సత్తయ్య, పోలిరెడ్డి సత్తన్న, బిస రమేష్, డాక్టర్ పోలు పరమేశ్వర్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు భూమా బిక్షపతి ,కట్ల శ్రీధర్, రేగుల అరుణ్‌రాజ్, తాళ్ల రవి, భూపాలపల్లి జిల్లా మేపా సోషల్ మీడియా ఇన్‌చార్జి జోడు ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయు)

2024 డైరీ ఆవిష్కరించిన కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-భూపాలపల్లి

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) డైరీని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేస్ మిశ్రా, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే వేరువేరుగా ఆవిష్కరించారు. మంగళవారం ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలోని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి 10 గుంటల ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఐజేయూ నాయకులు కోరారు. ఇటీవల భూపాలపల్లి నూతన డీపీఆర్ఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సామల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి చింతల కుమార్ యాదవ్,శనిగరం లక్ష్మన్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సాంబయ్య, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- **జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

నవతెలంగాణ-భూపాలపల్లి

నేటి నుండి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరై మంచి ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూఒక్క నిమిషం నిబంధనలు అమల్లో ఉన్నందున నిర్దేశిత సమయం కంటే ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ నుండి మార్చి 14వ తేది వరకు పరీక్షలు జరుగనున్నాయని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 8.30 గంటల నుండే అనుమతిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మొదటి సంవత్సరం 2161మంది రెండవ సంవత్సరం 1764మంది మొత్తం 3925మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని అన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలని చెప్పారు. కస్టోడీయన్



నుండి పరీక్షా కేంద్రాలకు, అలాగే పరీక్ష ముగిసి అనంతరం పోస్టాఫీస్ వరకు ప్రశ్న, జవాబు పత్రాల తరలింపులో పోలీస్ ఎస్కార్ట్ వినియోగించాలని చెప్పారు. విద్యార్థులు ఎలాంటి మాల్ ప్రాక్టీసులకు పాల్పడకుండా నిబద్ధతతో పరీక్షలు రాయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, ఇన్విజిలేటర్స్ సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లడానికి అనుమతి లేదని చెప్పారు. పరీక్షా కేంద్రం బయట నిశిత పరిశీలన తదుపరి విద్యార్థులను కేంద్రంలోకి అనుమతి ఉంటుందని చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సురక్షిత మంచి నీరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అలాగే అన్ని పరీక్షా కేంద్రాల్లో అత్యవసర చికిత్సా కేంద్రాలు ఏర్పాటుతో పాటు ఓఆర్ఎస్, తగినన్ని మందులను సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలను స్థానిక తహసీల్దార్లు తనిఖీ చేయాలని చెప్పారు. ఒత్తిడికి గురి కాకుండా మానసిక ప్రశాంతతతో పరీక్షలు రాసినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు మానసికపరమైన ఒత్తిడిని అధిగమించేందుకు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన 14416, 18008914416 కంట్రోల్ రూమ్‌నంబర్ల ద్వారా మానసిక నిపుణులు సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు.

నేడు సూరారం గ్రామపంచాయతీ గ్రామసభ

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని సూరారం గ్రామపంచాయతీ ప్రత్యేక గ్రామసభ నేడు నిర్వహిస్తున్నట్టు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిప్రసాద్ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉన్న నీటి సమస్య సమస్యలపై గ్రామసభ నిర్వహిస్తున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సదానందంకు ఎంపీ టికెట్ ఇవ్వాలి

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

నవతెలంగాణ-గణపురం

ఉద్యోగులు, ఇంజినీర్లకు నిత్యం అందుబాటులో ఉండే ఇంజినీర్ పరికి సదానందంకు వరంగల్ ఎంపీ టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో వారు మాట్లాడారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కారం చూపడంలో ముందుండే నాయకుడు సదానందం అన్నారు. విద్యుత్ సంస్థను కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్‌పరం చేసే కుట్రకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు మోరె కుమార్, బొమ్మకంటి రాజేందర్ చిలువేరు మల్లయ్య, ఇనుగాల కుమార్, గాజుల చంద్రయ్య, కోల శ్యాం, వొనపాకల సంపత్, పొన్నాల తిరుపతి, కొడెపాక రత్నాకర్, మోరె రవి సురేందర్, రాజు, రమేష్, మల్లేష్, రాజయ్య, కుమారస్వామి, శంకర్, మహేష్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.



ఏటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పీర్ల కృష్ణ బాబు

సంఘం బలోపేతానికి కృషి చేస్తా..

నవతెలంగాణ-వెంకటాపురం

తెలంగాణ రాష్ట్ర ఆదివాసి టీచర్స్ ఫెడరేషన్(టీఎస్ఏటీఎం) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పీర్ల కృష్ణబాబును ఎంపిక చేయడం పట్ల స్థానిక ఏటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఆదివారం ఏటీఎం రాష్ట్ర విస్తృస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కష్ణ బాబును ఎంపిక చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణ బాబు ను ఎన్నుకోవడం పట్ల ఆ సంఘం ములుగు జిల్లా కార్యదర్శి బుగ్గ లక్ష్మయ్య మండల అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు కోరం సంతోష్ మంగళ వారం హర్షం వ్యక్తం చేశారు. ఏజెన్సీకి సుపరిచితుడైన కృష్ణ బాబు సంఘం అభివద్ధికి తోడ్పాటు అందించే ందుకు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏజెన్సీ టీచర్ల హక్కుల సాధనకై సంఘటితంగా పోరాటం చేస్తామని కృష్ణబాబు తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుడుకి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మంగపేట

దీర్ఘ కాలికంగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో భాధ పడుతున్న మండలంలోని ఆకినేపల్లి మల్లారం గ్రామానికి చెందిన చెట్టుపల్లి వెంకటేశ్వర్లు కుటుంబానికి మంగళవారం నాసిరెడ్డి వినయ్ కుమార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ నాసిరెడ్డి వినయ్ భాస్కర్ రెడ్డి, సాంబశివ రెడ్డిలు పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని పెద్దలు చెప్పిన నానుడిని అనుసరిస్తూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆపదలో ఉన్న వారికి ఇతోధికంగా సాయపడటం ఆనందంగా ఉందన్నారు. వినయ్ కుమార్ రెడ్డి ట్రస్ట్ ద్వారా మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు ఈ పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు గౌరవ సలహాదారు నాసిరెడ్డి నాగిరెడ్డి, గ్రామస్తులు కటుకూరి శేషయ్య, తొండపు సంజీవరెడ్డి, నాసిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి,షేక్ మోయునుద్దిన్, ధూళిపాల బాలకష్ణ, ఎలగొండ సమ్మయ్య, దూలగొండ నారాయణ, శెట్టిపల్లి నరసింహారావు, శెట్టిపల్లి రాజు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వలస ఆదివాసీల సాగు భూములకు పట్టాలు అందించాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రవీందర్

నవతెలంగాణ - ములుగు

వలస ఆదివాసీల సాగులో ఉన్న భూములకు పట్టాలు అందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. జగ్గన్న గూడెం లోని వలస ఆదివాసీల గూడెంలో జిల్లా నాయకులు ఎండీ అంజద్ పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో జంపాల రవీందర్ మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వలస ఆదివాసీలు పోడు వ్యవసాయం చేస్తూ, ఇతర కూలీ, నాలీ పనులు చేస్తూ జీవిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఆ ప్రాంతంలో సాగులో ఉన్న భూములకు పట్టాలు అందించాలని, అన్ని సౌకర్యాలు కల్పించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా సాగులో ఉన్నా ఇప్పటికీ అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి, వెంటనే ఫారెస్ట్ అధికారుల దాడులను నిలిపివేయాలని సూచన చేయాలని, వారికి సంపూర్ణ న్యాయం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వలస ఆదివాసీలు, మాడవి లింగమూర్తి, సాంబు, మాడవి సోను, మాడవి లస్మయ్యతోపాటు 50మంది పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి రూ.25వేల చెక్ అందజేత

నవతెలంగాణ - ములుగు

ములుగు మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన బుర్ర ఐలయ్య గౌడ్ గత నెల 31 న ప్రమాదావశత్తు తాటి చెట్టు పై నుండి పడి మృతిచెందాడు. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పులి నర్సయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో టాడి కార్పొరేషన్ అధికారులకు దరఖాస్తు చేయగా రూ.25 వేల చెక్కు మంజూరైంది. మంగళవారం బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రతినిధి బృందంతో కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. తాటి చెట్ల పైనుండి పడిన బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా సంవత్సరాల నుండి రాక బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి పొన్నం మానస గౌడ్, సంఘం జిల్లా నాయకులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్,బుర్ర జనార్దన్ గౌడ్,అలుగుల ప్రభాకర్ గౌడ్,అశోక్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సోనియా, రేవంత్, శ్రీధర్‌బాబు చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-మల్హర్‌రావు/మహాదేవపూర్

మాదండి అనిల్ కుమార్ యాదవ్‌నురాజ్య సభ సభ్యుడిగా రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కాగా మంగళవారం కాటారం మండల కేంద్రంలో అఖిల భారత మహా యాదవ సంఘం ఆధ్వర్యంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ,పరిశ్రమల, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు చిత్ర పటాలకు మంగళ వారం పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం చంద్రయ్య యాదవ్, బోయిని రాజయ్య యాదవ్, గడ్డి మల్లేష్ యాదవ్, అబ్బినవేన ఐలయ్య యాదవ్, జిల్లెల్ల మల్లేశ్ యాదవ్, మొగిలి రాజ్ కుమార్ యాదవ్, కొడారి చిన్న మల్లు యాదవ్, జక్కుల పెద్ద ఐల్లయ్య యాదవ్, రాజయ్య యాదవ్, చంద్రయ్య యాదవ్, మొగిలి లచ్చయ్య యాదవ్, తొట్ల శ్రీశైలం యాదవ్, తదతరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలు

తహసీల్దార్ శ్రీనివాస రావు

నవతెలంగాణ-వాజేడు

ఇంటర్ పరీక్షలు బుధవారం నుండి జరగుతున్న నేపథ్యంలో పరీక్షలు ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో కట్టుదిట్టంగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రమైన వాజేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధిస్తున్నట్లు వాజేడు మండల తహసీల్దార్ శ్రీనివాస రావు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సెక్షన్ మార్చి 19 వరకు అమలులో ఉంటుందని అన్నారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కేంద్రం సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాల న్నారు. ఇందుకు స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు


కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ యాసం సరిత

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవ్ పుర్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు జనరల్ విద్యార్థులు 103మంది, ఒకేషనల్ విద్యార్థులు 38మంది హాజరుకానున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్ 95మంది, ఒకేషనల్ విద్యార్థులు 24 మంది హాజరు కానున్నారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ యాసం సరిత ప్రకటనలో తెలిపారు. వార్షిక పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లతోపాటు భద్రత ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావాలని అన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా వార్షిక పరీక్షలకు అనుమతి లేదని తెలిపారు. విద్యార్థుల కోసం మంచినీటితోపాటు ఇతర సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలు ఉంటుందని అన్నారు. ఎలాంటి మాస్ కాపీలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-మహాదేవపూర్



మండలంలోని అన్నారం గ్రామ ముస్లిం కాలనీకి చెందిన ఎస్కే హెూలీ, ఎస్ కే సలీంల మాతృమూర్తి ఇటీవల మృతిచెందింది. మంగళవారం బాధిత కుటుం బాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించి నిత్యవసర సరుకులు, బియ్యం బస్తాలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేమునూరు రమాదేవి చంద్రశేఖర్, ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య మాజీ ఉప సర్పంచ్ దూనే సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పర్షవేన నాగేష్ యాదవ్, రత్న ప్రభాకర్ రెడ్డి, వెన్నపురెడ్డి రాజశేఖర్ రెడ్డి, అత్తిని మొండన్న, పానెం రాజబాబు, అనసూరి వెంకన్న, నగునూరి స్వామి, అనుదీప్, బెల్లంపల్లి కరుణాకర్ భోగె దేవేందర్, యూత్ నాయకులు, మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.